

ఆ ఇద్దరే కీలకం



- అవినీతి రొంపిలో నంద్యాల మార్కెట్ యార్డు
- పొగాకు, మిర్చి లారీల నుంచి అక్రమ వసూళ్లు..
- రైతు బజార్ దుకాణదారుల నుంచీ..
- మీటర్ల ఏర్పాటులో చేతివాటం
- నకిలీ కార్మికుల పేరుతో నెలవారి జీతాలు డ్రా
- ఆ శాఖ ఉన్నతాధికారులకూ వాటాలు..?
- విచారణ తూతూ మంత్రమనే ఆరోపణలు

నంద్యాల మార్కెట్ యార్డులో జరిగిన అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన పైసా వసూల్..!, అక్రమార్కుల్లో అలజడి..! వరుస కథనాలు ఆ శాఖ ఉద్యోగుల్లో అలజడి రేపాయి. తీగ లాగితే.. డొంక కదులుతుందన్న చందంగా మార్కెట్ యార్డులోని అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు రావడం ఉత్కంఠ రేపుతోంది. యార్డులో జరుగుతున్న అక్రమాల్లో కీలక అధికారి, ఆ తర్వాత స్థాయి అధికారి పాత్ర కూడా ఎక్కువగా ఉందని సమాచారం. పైగా ఈ ఇద్దరు అధికారులకు ఈ మార్కెట్ యార్డులో ఏళ్ల తరబడి పనిచేసిన అనుభవం ఉండటంతో పాటు ఉన్నతాధికారుల అండదండలతో అందినకాడికి దోచుకుంటున్నారనే విమర్శలు లేకపోలేదు.

నంద్యాల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల మార్కెట్ యార్డులోని కీలక అధికారితో పాటు.. ఆ తర్వాత స్థాయిలో పనిచేస్తున్న మరో అధికారి అంటే సిబ్బందికి హడల్. వారు ఏది చెప్పితే అది చేయాలి.. లేకపోతే అంతే సంగతులు. వారికి ఆగ్రహం వస్తే సీటు మార్చేస్తారు. నిబంధనలకు విరుద్ధంగా బిల్లులను అప్‌లోడ్ చేయమంటే.. భవిష్యత్‌లో ఇబ్బంది వస్తుందని.. ఓ ఉద్యోగి నిరాకరించాడు. అంతే.. సదరు ఉద్యోగి సీటు మార్చి మరో ఉద్యోగికి అప్పగించి పనులు చక్కబెట్టుకున్నారని ఆ శాఖ వర్గాల నుంచి తెలుస్తోంది. తాము అప్పగించిన పనిని నిరాకరించిన ఉద్యోగిని ఇప్పటికీ సదరు అధికారులు ఇబ్బందులకు గురిచేస్తూనే ఉన్నారని సమాచారం. ఇది ఒక్క ఉదాహరణ మాత్రమే. వారి చెప్పింది చేయకపోతే ఎవరికైనా ఇదే దుస్థితి. ఇలా వీరి ఆగడాలను భరించలేక చాలా మంది ఉద్యోగులు సతమతమవుతున్నట్లు తెలుస్తోంది.



ట్యాంకు ఆవరణలో పేరుకుపోయిన చెత్త చెదారం

పొగాకు.. మిర్చి లారీల నుంచి...

వివిధ రూపాల్లో చేసిన అక్రమ వసూళ్లు చాలదన్నట్టు.. సదరు అధికారులు కలిసి గుట్టుగా ఎక్కడ వీలైతే అక్కడ చేతివాటం ప్రదర్శించి క్యాష్ చేసుకుంటున్నారని ఆ శాఖలో ఆరోపణలు ఉన్నాయి. మార్కెట్‌యార్డులో పొగాకుకు ప్రభుత్వం పన్ను సడలింపు ఇచ్చింది. అయితే ఇటీవల పొగాకు తెచ్చి మార్కెట్‌యార్డులో నిల్వ ఉంచుకున్న ఓ వ్యక్తి నుంచి సదరు కీలక అధికారి రూ. 50 వేలు ముడుపులు తీసుకున్నట్లు సమాచారం. ఇదే క్రమంలో శుభ్రం చేయాలని ఆ వ్యక్తిని డబ్బులు డిమాండ్ చేయడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. అదే విధంగా రెండు రోజుల కిందట రెండు మిర్చి లారీలు వెళ్తుంటే.. ఈ ఇద్దరు అధికారులు అక్రమంగా ఒక్కొక్క లారీ నుంచి రూ. 3 వేలు చొప్పున రూ. 6వేలు అక్రమ వసూళ్లు చేసినట్లు సమాచారం. ఇలా.. ఎవరైనా సరే మార్కెట్ యార్డుకు వచ్చే వారి నుంచి బలవంతంగా అక్రమ వసూళ్లు పాల్పడి సొమ్ము చేసుకుంటు న్నారనే ఆరోపణలు లేకపోలేదు. వాస్తవంగా ఎవరైనా పంటలు తెచ్చి నిల్వ ఉంచితే.. తరలించిన తర్వాత శుభ్రం చేయించాల్సిన బాధ్యత మార్కెట్‌యార్డు అధికారులదే. కానీ.. శుభ్రం చేయించాలనే పేరుతో ఆయా పంటల యజమానుల నుంచి అక్రమంగా వసూళ్లు చేస్తున్నారని బాధిత వర్గాల నుంచి తెలిసింది. ఇంతకంటే దారుణం ఏమిటంటే.. వచ్చిన పంటలను బిల్లుల పరంగా తక్కువ చూపి.. పన్ను కూడా తక్కువగా వసూళ్లు చేసి.. ఆ తర్వాత చేతివాటం ప్రదర్శించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి.. జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



నిల్వ ఉంచిన పొగాకు బ్యాగులు..

అన్నింటా ఫేక్ బిల్లులే...

మార్కెట్‌యార్డులో గత ఛైర్మన్ సహకారంతో ఈ అధికారులు ఇలాంటి అవినీతి పనులకు పాల్పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిక ఇప్పటి వరకు మార్కెట్‌యార్డుకు ఛైర్మన్ లేకపోవడంతో.. ఈ ఇద్దరు అధికారులు పలు రూపాల్లో ఇష్టారాజ్యంగా ఫేక్ బిల్లులు సృష్టించి నిధులు స్వాహా చేశారనే విమర్శలు ఉన్నాయి. మరుగుదొడ్ల క్లీనింగ్, మరమ్మతులు, మార్కెట్‌యార్డు ఆవరణలో చెత్తచెదారం తొలగింపు, పిచ్చిమొక్కల తొలగింపు.. ఇలా అక్కడబడితే అక్కడ చేతివాటం ప్రదర్శించి, నకిలీ బిల్లులు తయారు చేసి నిధులు స్వాహా చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఉన్నతాధికారులకు వాటాలు...?

ఈ అధికారులు అక్రమ వసూళ్ల నుంచి వచ్చిన డబ్బుల్లో కొంత వాటా తమ ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు బహిరంగంగా ఆ శాఖలో మాట్లాడుకుంటున్నారు. పత్రికల్లో కథనాలు వచ్చినా, ఎవరు ఫిర్యాదు చేసినా.. ఉన్నతాధికారులు ఏమీ చేయరనే ధైర్యంతో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆ శాఖ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది.

తూతూ మంత్రంగా విచారణ చేశారని ఆరోపణలు..



విచారణ చేస్తున్న దృశ్యం

పత్రికల్లో వచ్చిన వరస కథనాలతో ఆ శాఖ జేడీ రెండు రోజుల కిందట విచారణ చేశారు. అయితే.. ఆశించిన స్థాయిలో లోతుగా విచారణ చేయాలేదని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. గతంలో ఓ వ్యక్తి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు గుర్తించిన వాటినే తాజా విచారణలో కూడా గుర్తించినట్లు తెలుస్తోంది. విచారణ లోతుగా చేయలేదనే విమర్శలు ఉన్నాయి. సదరు కీలక అధికారి పై స్థాయిలో చక్రం తిప్పడమే దీనికి కారణమని అంటున్నారు. వీరి అక్రమాల్లో కొంత వాటా విచారణ అధికారికి వెళ్లడం వల్ల పెద్దగా పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. కాబట్టి ఈ విచారణ మీద నామమాత్రపు చర్యలు మాత్రమే ఉండొచ్చని ఉద్యోగులు అనుకుంటున్నారు. విచారణ అధికారి ఏ మేరకు అవినీతి అక్రమాలను గుర్తించి కలెక్టర్‌కు అందజేసేదీ ఎదురు చూడాల్సిందే.

జాయింట్ కలెక్టర్‌తోనూ విచారణ చేయిస్తాం



మార్కెట్ యార్డులో జరిగిన అవినీతి అక్రమాలతో పాటు పత్రికలో వచ్చిన కథనాల ఆధారంగా విచారణకు ఆదేశించాం. ఆ శాఖ జేడీ కూడా నివేదిక అందజేశారు. ఆ నివేదికపై మరోసారి జాయింట్ కలెక్టర్‌తోనూ విచారణ చేయించి తప్పులు చేసినట్లు రుజువైతే శాఖపరంగా చర్యలు తీసుకుంటాం.

- కలెక్టర్ రాజకుమారి

కార్మికుల పేరుతో జీతాలు డ్రా...

ప్రతి ఏడాది నవంబరు నుంచి మే నెల వరకు మిర్చి తదితర పంటల మార్కెట్‌కు అధికంగా వస్తుంటాయి. ఆయితే ఈ పంట దిగుబడులు తరలించిన తరువాత శుభ్రం చేయడం పేరుతో ఆయా కాల వ్యవధిలో సుమారు 10మంది కార్మికులు(స్వీపర్లు) అవసరమని భావించి వారిని ఈ ఇద్దరు అధికారులు విధుల్లోకి తీసుకుంటారు. అంటే.. వీరందరూ రికార్డుల్లో మాత్రమే ఉంటారు. మార్కెట్ యార్డులో ఉన్న ముగ్గురు స్వీపర్లతోనే ఈ పనిని కూడా బలవంతంగా చేయించి 10 మంది స్వీపర్లు ఉన్నట్లు రికార్డుల్లో చూపి వారి పేరుతో నెలవారి జీతాలు డ్రా చేస్తున్నట్లు ఆ శాఖ వర్గాల నుంచి తెలిసింది. ఒక్కొక్కరికి నెలకు రూ. 10 వేలు చొప్పున.. నెలకు.. రూ. 1లక్ష చొప్పున అప్పనంగా నకిలీ కార్మికుల పేరుతో దోచేస్తున్నారని సమాచారం.

రైతు బజార్‌లోనూ అదే దుస్థితి

మార్కెట్ యార్డు ఆవరణలోనే రైతు బజార్ ఉంది. ఇక్కడ దుకాణాలకు విద్యుత్ సదుపాయం కోసం మార్కెట్‌యార్డులోని నిధులను డ్రా చేసి సదరు రైతు బజార్‌కు విద్యుత్ సదుపాయం కల్పించినట్లు సమాచారం. ఆయా దుకాణాలకు మీటర్లను కూడా అమర్చినట్లు తెలిసింది. ఆయితే.. మీటర్ల ఏర్పాటు పేరుతో ఒక్కో దుకాణదారు నుంచి రూ. 8 వేలు చొప్పున సదరు ఈ అధికారులు వసూలు చేసినట్లు తెలిసింది.



రైతు బజార్‌లోని దుకాణాలు

కనిష్ఠంగా శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం

సున్నిపెంట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం కనిష్ఠ స్థాయి కంటే దిగువకు పడిపోయింది. దీనితో ఇరు రాష్ట్రాల ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. డ్యామ్ పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడగులు కాగా బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి నీటిమట్టం 818 అడుగులకు చేరింది. నీటి సామర్థ్యం 215 టీఎంసీలకు గాను 39.90 టిఎంసీలుగా నమోదు అయింది. కేంద్ర ప్రభుత్వ జల వనరుల శాఖ ఆదేశాల మేరకు డ్యాం నీటి మట్టం 834 అడుగులకు తగ్గకుండా చూసుకోవాలి. కేంద్ర జల వనరుల శాఖ అదేశాలు బేఖాతరు చేస్తూ తెలంగాణ రాష్ట్రంలోని ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో ప్రతి రోజు విద్యుత్ ఉత్పాదన జరుపుతున్నారు. దీనితో రిజర్వాయర్‌లో క్రమేపీ నీటి నిలువలు తగ్గుతున్నాయి. కుడి గట్టు విద్యుత్ కేంద్రంలో డ్యాం నీటి మట్టం 797 అడులు వరకు విద్యుత్ ఉత్పాదన చేసే అవకాశం ఉంది. కాని రిజర్వాయర్‌లో వండ్రు పేరుకు పోవడంతో కుడి గట్టు విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదనకు అనుకూలంగా లేదు. అయితే బుధవారం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదన జరిగింది. దీనితో 410 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేశారు. ఇక కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2400 క్యూసెక్కులు విడుదల చేశారు. ఆంధ్ర ప్రదేశ్‌లోని ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకానికి కేవలం 245 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేశారు. వేసవి తాపానికి 358 క్యూసెక్కుల నీరు అవిరి అయ్యిందని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో బుధవారం 0.177 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి జరిగినట్లు తెలంగాణ జెన్‌కో అధికారులు తెలిపారు.



తేనె.. లాభాల పట్టు

- పెట్టుబడి స్వల్పం, దిగుబడి అధికం
- ఉపాధినిస్తున్న తేనె తయారీ
- ఏటా రూ.5 లక్షల ఆదాయం గడిస్తున్న అన్వర్‌బాషా

6

చెరువులకు జీవకళ

తియ్యటి మందు..

- హోమియోకు పెరుగుతున్న ఆదరణ
- దీర్ఘకాలిక రోగాలకు ప్రత్యామ్నాయ వైద్యం
- నేడు ప్రపంచ హోమియో దినోత్సవం

7

మెగా డీఎస్సీకి ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీకి సిద్ధమవుతున్న బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీకి చెందిన అభ్యర్థులు మెగా డీఎస్సీకి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ తీసుకునేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి ఓబులేసు బుధవారం తెలిపారు. టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు తమ సొంత జిల్లాలోనే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు పత్రంతో పాటు కుల, నేటివిటి, ఆదాయ, టెట్ పరీక్షలో అర్హత సాధించిన పత్రాలను జతచేసి నంద్యాల జిల్లా కేంద్రంలోని బొమ్మలసత్రం సమీపంలో ఉన్న జిల్లా వెనుకబడిన తరగతులు, సాధికారత అధికారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

ఆలమూరులో 40.35 డిగ్రీల ఉష్ణోగ్రత

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో రుద్రవరం మండలంలో అత్యధికం



నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా రుద్రవరం మండలం ఆలమూరు గ్రామంలో 40.35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ నిపుణులు వెల్లడించారు. ఆ తర్వాత కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం వగరూరు గ్రామంలో 40.2, నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలం ఈర్నపాడులో 39.98 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నంద్యాల జిల్లాలో దొర్నిపాడు గ్రామంలో 39.77, పాణ్యం మండలం గోనవరంలో 39.7, చాగలమర్రి మండలం ముత్యాలపాడులో 39.49, శిరివెళ్లలో 39.44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే మహానంది మండలం గాజులపల్లె, బుక్కాపురం గ్రామాల్లో 39.37, వెల్దుర్తి మండలం కలుగొట్లలో 39.37, సంజామల మండలం లింగందిన్నె గ్రామంలో 39.29, బండిఆత్మకూరు మండలం పెద్దదేవళాపురం గ్రామంలో 39.11, బనగానపల్లె పాతపాడు గ్రామంలో 39.03, గోస్పాడు గ్రామంలో 39.02 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కర్నూలు జిల్లాలో కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామంలో 39.59, కౌతాళం మండలం తోవి గ్రామంలో 39.04, కోసిగి మండలం సత్తనూరులో 39.09 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

రాబోయే ఐదు రోజుల్లో..

కర్నూలు జిల్లాలో రాబోవు ఐదురోజుల్లో పలు చోట్ల చిరు జల్లులు పడే అవకాశం ఉందని, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39.7 డిగ్రీల సెల్సియస్ నుంచి 40.5 డిగ్రీల వరకు నమోదు కావచ్చని భారత వాతావరణ సంస్థ నిపుణులు వెల్లడించారు. అలాగే ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని, గాలిలో తేమశాతం ఉదయం 54 నుంచి 66 శాతం, మధ్నాహ్నం పూట 16 నుంచి 20 శాతం నమోదయ్యే అవకాశముందని తెలిపారు.

నంద్యాల జిల్లాలో రాబోయే ఐదు రోజుల పాటు కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39.7 నుంచి 42.2 డిగ్రీలు నమోదు కావొచ్చని భారత వాతావరణ సంస్థ నిపుణులు తెలిపారు. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 8 నుంచి 9 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశముందని, గాలిలో తేమశాతం ఉదయం 65 నుంచి 74శాతం, మధ్యాహ్నం 17 నుంచి 20 శాతం నమోదు అయ్యే అవకాశముందని వెల్లడించారు.

ముగిసిన 'పది' మూల్యాంకనం

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్‌డీఆర్ పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం ఈనెల 3వ తేదీన ప్రారంభమై బుధవారం ముగిసింది. డీఈవో జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ మూల్యాంకనం ప్రశాంతంగా ముగిసిందని చెప్పారు. 100 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 650 మంది సహాయ ఎగ్జామినర్లు, 200 మంది స్పెషల్ అసిస్టెంట్స్ విధులకు హాజరై 1,78,182 జవాబు పత్రాలను మూల్యాంకనం చేసినట్లు వెల్లడించారు. ఎక్కడా ఎలాంటి అసౌకర్యాలు లేకుండా పూర్తి చేశామని, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టి: ఎస్పీ

నంద్యాల క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టి సారించినట్లు ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా బుధవారం తెలిపారు. జిల్లా కేంద్రం శివారు ప్రాంతాల్లో మంగళవారం అర్ధ రాత్రి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించినట్లు చెప్పారు. రాత్రి పెట్రోలింగ్, గస్తీని పటిష్ఠం చేసినట్లు తెలిపారు. అత్యవసరమైతే తప్ప రాత్రివేళల్లో అనవసరంగా రోడ్లపై తిరగకూడదని యువతను హెచ్చరించారు. పోలీస్ సబ్ డివిజన్లలో పోలీస్ అధికారులతోపాటు ఒక డీఎస్పీ స్థాయి అధికారి రాత్రి గస్తీని పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. అనుమానాస్పద వ్యక్తుల నుంచి వేలిముద్రలను సేకరించినట్లు తెలిపారు. రాత్రిపూట నైట్ బీట్ సిబ్బంది తప్పనిసరిగా లాఠీని కలిగి ఉండాల, వారి స్టేషన్ పరిధిలోని నేరచరిత కలిగినవారిపై, అనుమానితులపై నిఘా ఉంచాలని సూచించారు. జిల్లాలోని రద్దీ, ప్రధాన కూడళ్లలో, సమస్యాత్మకమైన ప్రాంతాల్లో పోలీస్ అధికారులు నేరనివారణే లక్ష్యంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి గట్టినిఘాను చేయనున్నట్లు ఎస్పీ తెలిపారు.

తేనె.. లాభాల పట్టు


తేనె తయారు చేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న రైతు అన్వర్‌బాషా

- పెట్టుబడి స్వల్పం, దిగుబడి అధికం
- ఉపాధినిస్తున్న తేనె తయారీ
- ఏటా రూ.5 లక్షల ఆదాయం గడిస్తున్న అన్వర్‌బాషా

తేనె పలు రోగాలకు అద్భుతమైన ఔషధం. ఆయుర్వేద వైద్యంలో విరివిగా వినియోగిస్తారు. ఆహార పదార్థాల తయారీలోనూ వాడుతారు. చక్కెరకు ప్రత్యామ్నాయంగా వాడే తేనె వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం నాణ్యమైన తేనె మార్కెట్‌లో దొరకడం కష్టంగా ఉంది. ఈ పరిస్థితుల్లో తేనె తయారీ ఒక కుటీర పరిశ్రమలా రైతులను ఆదుకుంటోంది. దీనికి ఉదాహరణ.. రైతు అన్వర్‌బాషా.


అన్వర్‌బాషా

చాగలమర్రి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రికి చెందిన రైతు అన్వర్‌బాషా అందరు రైతుల్లా కాకుండా భిన్నంగా ఆలోచించి తేనెటీగల పరిశ్రమ నెలకొల్పి లాభాలు గడిస్తున్నాడు. 2019లో గుంటురులోని ఓ ప్రైవేటు కంపెనీ ద్వారా శిక్షణ పొందాడు. 2020లో 25 తేనెటీగల బాక్సులతో పరిశ్రమను ప్రారంభించారు. ఒక్కో బాక్సును రూ.7,500 చొప్పున ఏలూరులో కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి తెచ్చి చాగలమర్రి, ఖైదుకూరు సమీపంలోని కంసల వనిపెంట, ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసి తేనె సేకరిస్తున్నాడు. ఒక్కో బాక్సులో 10 ఫ్రేమ్‌లు ఏర్పాటు చేశాడు. ఒక్కో దాంట్లో 75 వేల నుంచి లక్ష వరకు తేనెటీగలు ఉంటాయి. అనువైన ప్రదేశాలు ఎంపిక చేసుకొని అక్కడి రైతు పొలాల్లో తేనెటీగల వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ బాక్సులు ఏర్పాటు చేశాడు. పొద్దుతిరుగుడు, మినుము, జొన్న, పెసర, మొక్కజొన్న, మామిడి, సజ్జ, నేరేడు, సపోటా తదితర పంటలు అధికంగా ఉన్న ప్రదేశాలను ఎంపిక చేసుకొని ఒక నిర్దిష్ట ప్రదేశంలో సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. తేనెటీగ సుమారు 10 కిలోమీటర్ల మేర తిరిగి పొలాల్లో మెక్కల మీది నుంచి మకరందాన్ని సేకరించి సాయంత్రానికి తిరిగి బాక్సులోకి చేరుకుంటుంది. ప్రతి బాక్సులో రాణి తేనెటీగ ఒకటి ఉంటుంది. అది గుడ్లు పెట్టి, తేనెతుట్టెను ఏర్పాటు చేయడం ద్వార తేనె ఉత్పత్తి అవుతుంది. 35 నుంచి 45 రోజులకు ఒకసారి తేనెను సేకరిస్తారు.

కాల పరిమితి, విధి విధానం

సాధారణంగా 45 రోజులకు తేనె చేతికందుతుంది. ఈ 45 రోజుల పాటు నిత్యం కేంద్ర నిర్వాహకులు అన్వర్‌బాషాతో సహా ఉన్న నలుగురు వ్యక్తులు ప్రతి రోజు లేదా రోజుమార్చి రోజు పర్యవేక్షిస్తుంటారు. వైరస్ సోకకుండా బాక్సుల బయట వైపు నివారణ మందు చల్లుతారు. ఈ 45 రోజుల్లో పెద్ద వర్షం వస్తే నష్టం వాటిల్లినట్లే. నిత్యం బాక్సులను శుభ్రం చేసుకుంటూ పరిరక్షించాలి. బాక్సుకు సమస్య వస్తే దానిని తొలగించి కొత్త బాక్సును అమర్చాలి. ఒక్కో బాక్సులో సుమారు 40 వేల నుంచి 50 వేల వరకు తేనెటీగలు ఉంటాయి.


చాగలమర్రిలో తేనెటీగల కోసం ఏర్పాటు చేసిన బాక్సులు

పెట్టుబడి రూ.7,500లు

తేనెటీగల బాక్సు, తేనెటీగల కొనుగోలుకు రూ.7,500 ఖర్చు చేస్తున్నారు. ప్రతిసారి తేనెను సేకరించేందుకు ప్రతి బాక్సుకు కూలీలకు మరో రూ.700 ఖర్చు చేస్తున్నారు. బాక్సు నుంచి 4 కిలోల తేనె సేకరిస్తున్నారు. 25 బాక్సులకు రూ.2 లక్షలు పెట్టుబడి పెడితే రూ.10 లక్షలు దిగుబడి వస్తుంది. ఖర్చులన్నీ పోను రైతుకు రూ.5 లక్షలు వస్తుంది. ఇలా 2020లో 25 బాక్సులతో ప్రారంభించి ప్రస్తుతం 140 బాక్సులతో పరిశ్రమను నడిపిస్తున్నారు. చాగలమర్రి గ్రామ సమీపంలోని హైవే రహదారి సమీపంలో బాక్సులను ఏర్పాటు చేసి కూలీలచే తేనెటీగల పరిశ్రమను నిర్వహిస్తూ తేనెను సేకరిస్తున్నారు.


తేనె తయారీకి ఉపయోగించే రాణి ఈగలు

కష్టిస్తే ఆదాయం అందినట్లే

ఈ ప్రక్రియ సక్రమంగా సాగితే ఒక్కో బాక్సు నుంచి సుమారు 4 నుంచి 5 కేజీల తేనె లభిస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ తేనె విలువ రూ.400 నుంచి రూ.500 మధ్య ఉంది. మొత్తంగా ఈ కాల పరిమితి ముగిసే సరికి 750 కేజీల వరకు తేనెను సేకరించి హోల్‌సేల్ లేదా రిటైల్ మార్కెట్‌లకు విక్రయిస్తున్నారు. అంటే సుమారు 40 రోజుల్లో రూ.4 లక్షల వరకు చేతికి అందగా ఖర్చులు, శ్రమ రూ.2 లక్షలు మినహాయించిన రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుంది. నెలకు రూ.40 వేల నుంచి రూ.50 వేల దాక కూడా ఆదాయం చేకూరుతుంది. తేనెటీగల పరిశ్రమలో పని చేసే కూలీలకు కిలోకు రూ.70 ప్రకారం కూలీ ఇవ్వాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్ వేదికగా అమ్మకాలు

అన్వర్‌బాషా వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర ఆన్‌లైన్ మాధ్యమాల ద్వార వినియోగదారులకు కిలో తేనే రూ.450 విక్రయిస్తున్నాడు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నవారికి కొరియర్ ద్వార సరఫరా చేస్తున్నాడు. చాగలమర్రి నుంచి కర్నూలు, కడప, నంద్యాల, హైదరాబాదు, బెంగుళూరు తదితర ప్రాంతాలకు తేనెను సరఫరా చేస్తూ లాభాలను గడిస్తున్నాడు.

పబ్లిసిటీ కోసమే జగన్ రాప్తాడు పర్యటన

- పోలీసుల బట్టలు ఊడతీస్తా అనడం ఏమిటి ?
- 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జగన్ రాప్తాడు పర్యటన కేవలం తన పబ్లిసిటీ కోసమేనని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసి మాట్లాడుతూ భద్రత వైఫల్యం అంటూ పోలీసులపై జగన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గం అన్నారు. పోలీసుల బట్టలు ఊడదీస్తానంటూ హెచ్చరించడం సరైన పద్ధతి కాదన్నారు. 11 ఏళ్లుగా బెయిల్‌పై బయట తిరుగుతూ రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్నారని అన్నారు. పోలీసులు ప్రొటోకాల్‌ను పాటిస్తే వారిపైకి వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టేలా మాట్లాడటం తగదని అన్నారు. ప్రజల మధ్య తగువుపెట్టేందుకే జగన్ బయటకు వస్తున్నారని, ఆయన ఉచ్చులో పడ వద్దంటూ విజ్ఞప్తి చేశారు.

ప్రాజెక్టుల నిర్వహణకు రూ. 3 కోట్ల ప్రతిపాదనలు

నంద్యాల మున్సిపాలిటీ ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్వాహణకు రూ. 3 కోట్ల నిధుల ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపామని మంగళవారం జిల్లా ప్రాజెక్టుల వాటర్ మేనేజ్‌మెంట్ రిసోర్స్ పర్సన్, టీజీపీ ఎస్ఈ శివప్రసాద రెడ్డి తెలిపారు. జిల్లాల్లో ఎస్సార్బీసీ, టీజీపీ, కేసీ తదితర ప్రాజెక్టుల నిర్వాహణ కోసం జలవనరుల శాఖ ముఖ్య ఇంజనీర్ కబీర్ బాషాకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ ప్రతిపాదనలు సీఈ ప్రభుత్వానికి పంపారని, త్వరలో నిధులు విడుదల అవుతాయని పేర్కొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్


పోస్టర్ విడుదల చేస్తున్న మంత్రి తదితరులు

నంద్యాల మున్సిపాలిటీ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించనున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతీ యువకుల కోసం నిర్వహించే ఈ మేళా జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జరుగుతుంది. టీడీపీ కార్యాలయంలో పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఎంఈ గుర్రప్ప, కోఆర్డినేటర్ బాల వీరారెడ్డి పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు రుణాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పొదుపు మహిళా సంఘాలకు రుణాలు విరివిగా ఇవ్వాలని డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి బ్యాంకు అధికారులకు సూచించారు. బుధవారం నగరంలోని ఉద్యానభవన్‌లో ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీ, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పొదుపు మహిళా సంఘాలకు బ్యాంకు అధికారులు అత్యధిక రుణాలు మంజూరు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రామచంద్రరావు, అన్ని బ్యాంకుల మేనేజర్లు, జిల్లా, మండలస్థాయి సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- జూన్‌లోగా పంట కుంటల నిర్మాణాలను పూర్తి చేయాలి
- రీ సర్వేలో తప్పులు చేస్తే చర్యలు
- కలెక్టర్ రంజిత్ బాషా


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఉపాధి హామీ, తాగునీరు, రీసర్వే, గ్రామ, వార్డు సచివాలయాల కార్యకలాపాలు, పీజీఆర్ఎస్ అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్ మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు కాని గోనెగండ్ల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి షోకాజ్ నోటీసు జారీ చేయాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్, మే, జూన్ నెలలో ముమ్మరంగా ఉపాధి హామీ పనులను కల్పించి 90 శాతం లక్ష్యాన్ని సాధించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 8,500 పంట కుంటలు నిర్మించడం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 5,661 నిర్మాణాలకు మంజూరు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. ఇందులో 1268 ప్రోగ్రెస్‌లో ఉన్నాయని, 437 పూర్తయ్యాయని అన్నారు. జూన్‌లోపు పంట కుంటల నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య మాట్లాడుతూ రీసర్వేకు సంబంధించి గ్రౌండ్ ట్రూతింగ్ పనులు పూర్తి చేసిన వెంటనే సర్టిఫికెట్ పంపాలని తహసీల్దార్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో వెంకటనారాయణమ్మ, డ్వామా పీడీ వెంకటరమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మే16న ఉచిత సామూహిక వివాహాలు

- అర్హులైన వధూవరులకు రూ.80 వేలు ఆర్థిక సాయం
- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మే నెల 16వ తేదీన వివాహాలు చేసుకునే జంటలకు రూ.80 వేలు ఆర్థిక సాయం అందించనున్నట్లు రాజ్యసభ సభ్యుడు మాజీ టీజీ వెంకటేశ్ బుధవారం తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అప్లికేషన్ల కోసం కర్నూలు నగరంలోని మౌర్యఇన్‌లోని కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. తన జన్మదినం సందర్భంగా గత 30 ఏళ్లుగా సామూహిక వివాహాలు నిర్వహిస్తూ వస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఈ కార్యక్రమం కొనసాగిస్తామన్నారు. వివాహం చేసుకునే వధూవరుల్లో ఒకరు కర్నూలు నియోజకవర్గ పరిధిలో గాని, పంచలింగాల, ఈ-తాండ్రపాడు, గొందిపర్ల, పూలతోట, దేవమాడ, దొడ్డిపాడు గ్రామాలకు చెందిన వారై ఉండాలని తెలిపారు. అన్ని కులాల వారు, ముస్లిం, క్రైస్తవులు అర్హులని చెప్పారు. దరఖాస్తు చేసుకునే వారు తమకు ఎటువంటి దురలవాట్లు లేవని, భవిష్యత్తులో కూడా చెడు అలవాట్లకు బానిసలు కాబోమని డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. నూతన వధూవరులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మేజర్లు అయి ఉండాలని, వారికి నగదు పారితోషికంతో పాటు తాళిబొట్టు, కాలి మెట్టలు, పట్టువస్త్రాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో దాశెట్టి శ్రీనివాసులు, వాయుగండ్ల సుబ్బారావు, కే.రామస్వామి, శ్రీకాంత్, బాలయ్య, పాల్‌రాజ్, హర్షవర్దన్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీజీ వెంకటేశ్

18 మంది ఎస్ఐల బదిలీ



కర్నూలు క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు రేంజ్ పరిధిలో 18 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎం.పరమేష్ నాయక్	వీఆర్, కర్నూలు	సి.బెళగల్ పీఎస్
ఎం.తిమ్మారెడ్డి	సి.బెళగల్ పీఎస్	కర్నూలు వన్‌టౌన్ యూపీఎస్
సి.శరత్ కుమార్ రెడ్డి	ముచ్చుమర్రి) పీఎస్ (నంద్యాల	నాగులాపురం పీఎస్
వీటీ ఆశాలత	నాగులాపురం పీఎస్	కర్నూలు త్రీటౌన్ యూపీఎస్
ఎస్.తిమ్మయ్య	గూడూరు పీఎస్	ఇస్వీ పీఎస్
ఎస్.నాగేంద్ర	ఇస్వీ పీఎస్	మహిళా పీఎస్, కర్నూలు
పి.నిరంజన్ రెడ్డి	పెద్దకడుబూరు పీఎస్	గూడూరు పీఎస్
పి.మధుసూదన్ రెడ్డి	సైబర్ సెల్	ఎమ్మిగనూరు టౌన్ పీఎస్
డీఆర్ నాయక్	ఎమ్మిగనూరు టౌన్ యూపీఎస్	పెద్దకడుబూరు పీఎస్
డి.ఎర్రిస్వామి	వీఆర్, కర్నూలు	కోడుమూరు పీఎస్
ఏపీ శ్రీనివాసులు	కోడుమూరు పీఎస్	కర్నూలు టూటౌన్ యూపీఎస్
డి.కిరణ్‌బాబు	వీఆర్, కర్నూలు	మహిళా పీఎస్, కర్నూలు
బి.మల్లికార్జున	వీఆర్, కర్నూలు	కర్నూలు టూటౌన్ పీఎస్
ఎస్పీ మహబూబ్ బాషా	వీఆర్ కర్నూలు	పీసీఆర్, కర్నూలు
బీవీ రమణారావు	మహిళా పీఎస్	కర్నూలు వన్‌టౌన్ యూపీఎస్
పి.నిర్మలాదేవి	మహిళా పీఎస్	కర్నూలు వన్‌టౌన్ యూపీఎస్
పి.మోహనకిషోర్ రెడ్డి	కర్నూలు టూటౌన్ పీఎస్	కర్నూలు ఫోర్త్ టౌన్ పీఎస్
సమీర్ బాషా	కర్నూలు ఫోర్త్ టౌన్ పీఎస్	ఆదోని వన్‌టౌన్ పీఎస్

చెరువులకు జీవకళ



- ఉపాధి హామీతో మారనున్న చెరువుల ముఖ చిత్రం
- పల్లె పుష్కరిణి పేరుతో భూగర్భ జలాల పెంపు
- ఉమ్మడి జిల్లాలో 60 చెరువుల అభివృద్ధికి ప్రణాళిక

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలోని చెరువుల రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. శిథిలావస్థకు చేరి కనుమరుగైపోయిన చెరువులకు మళ్లీ జీవకళ రానుంది. వచ్చే నెల నుంచి మొదలయ్యే కొత్త ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నీటి వనరుల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వర్షపు నీరు వృథా కాకుండా ఒడిసిపట్టి భూగర్భజలాలను పెంచేందుకు పల్లె పుష్కరిణి పేరుతో శిథిలావస్థకు చేరిన చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్లు చెరువులను పల్లె పుష్కరిణి కార్యక్రమం కింద ఎంపిక చేయడానికి విధి విధానాలను రూపొందించే పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రతి మండలానికి ఒకటి నుంచి రెండు చొప్పున మొదటి విడతగా కర్నూలు జిల్లాలో 30, నంద్యాల జిల్లాలో 35 చెరువులను ఎంపిక చేయాలని నిర్ణయించారు. రాయల కాలంలో ఈ చెరువులు గ్రామాలకు ప్రాణాధారంగా నిలిచాయి. తాగునీరు, సేద్యం కోసం పల్లెల్లో చెరువులు తొవ్వించారు. ఆ తర్వాత చెరువులు ప్రాధాన్యతను క్రమంగా కోల్పోయాయి. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం నీరు-చెట్టు, పూడికతీత కార్యక్రమాలను చేపట్టి కొంత మేరకు చెరువులకు జవసత్వాలు కల్పించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా చర్యలు చేపట్టింది.

ఈ నెలలోపు ఎంపిక

పల్లె పుష్కరిణి పేరుతో చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం ఈ నెల ఆఖరిలోపు శిథిలావస్థకు చేరిన పూర్తిగా కనుమరుగయ్యే దుస్థితిలో ఉన్న ఐదెకరాల్లోపు విస్తీర్ణంలో ఉన్న చెరువులను ఎంపిక చేయడంతో పాటు గ్రామ సభలో ఆమోదం తీసుకోవాలని ఉపాధి హామీ పథకం అమలు చేస్తున్న నీటి యాజమాన్య సంస్థ అధికారులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 30లోపు మొదటి విడతలో ఎంపిక చేసిన ఉమ్మడి జిల్లాలోని దాదాపు 65 చెరువుల అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. వర్షాకాలంలో చెరువులో చేరిన నీటిని సంరక్షించాలనేది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. ఉపాధి హామీ పథకంలోని మెటీరియల్ నిధులతో ఈ చెరువులను అభివృద్ధి చేయనున్నారు. పూడి పోయిన చెరువులలో కూలీల చేత మట్టిని తీయించనున్నారు. ఒక్కో చెరువు అభివృద్ధికి రూ.5లక్షల దాకా ఖర్చు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. గ్రామాల్లో ఉన్న కోనేర్లు, ఊటబావుల అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి పెట్టాలని ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. వేయికి పైగా జనాభా కలిగిన గ్రామాల్లో రాష్ట్ర, జాతీయ రహదారులకు దగ్గరలో ఉన్న చెరువులను పల్లె పుష్కరిణిలో గుర్తించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. చెరువు విస్తీర్ణం ఎకరా నుంచి ఐదెకరాలు ఉండాలని, ఈ ఎంపిక చేసిన చెరువులను రాష్ట్ర, జిల్లా మండ స్థాయి అధికారులు దత్తత తీసుకుని అభివృద్ధి చేసేలా నీటి యాజమాన్య సంస్థ కృషి చేయాలని ఉత్తర్వుల్లో ఆదేశించింది.

చెరువులను గుర్తిస్తున్నాం

ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఐదెకరాల్లోపు విస్తీర్ణం కలిగిన చెరువులను గుర్తిస్తున్నాం. ఈ నెలాఖరుకు ఎన్ని చెరువులు అందుబాటులోకి వస్తాయో జాబితాను తయారు చేస్తాం. కర్నూలు జిల్లాలో 30 చెరువుల దాకా పల్లెపుష్కరిణి కింద ఎంపిక చేసి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. గ్రామాల్లో వృథా నీటిని చెరువుల్లోకి మళ్లించి గ్రామ ప్రజల సాగు, తాగునీటి అవసరాలను గుర్తించడమే కాకుండా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తాం.

- వెంకటరమణయ్య, డ్వామా పీడీ

లోకాయుక్తలో వైసీపీ నాయకుల ఫిర్యాదు

మహానంది, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మహానంది మండలం గోపవరంలో అక్రమాలు జరగుతున్నాయని బుధవారం కర్నూలు లోకాయుక్త, మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పుల్లయ్య యాదవ్ తెలిపారు. గ్రామంలో కూటమి నాయకుల అండదండలతో భైరవాణి చెరువు నుంచి అక్రమ మట్టిని తరలిస్తున్నారని, అలాగే బెల్టుషాపుల నిర్వహిస్తున్నారని గ్రామస్థులతో కలిసి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ ఘటనలపై పలుమార్లు గ్రామంలో వివాదాస్పదంగా మారాయని, దీంతో భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

వేసవిలో ప్రత్యేక రైలు

మద్దికెర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేసవిలో రద్దీ నియంత్రణకు గుంతకల్లు మీదుగా వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఇప్పటి నుంచి ప్రతి శనివారం మే 10వ తేదీ వరకు హుబ్లీ, వారణాసికి రైలు నెం.07323 ఉంటుదన్నారు. తిరుగు ప్రయాణం రైలు ఈ నెల 8 నుంచి మే 13వ వరకు ప్రతి మంగళవారం నడపనున్నట్లు తెలిపారు. ఈ రైలు హవేరీ, రాణి బెంగుళూరు, హరిహార్, దేవనగిరి, జిగ్‌జాగుర్, కడూర్, హర్సికెర, టోంకూరు, ఎల్లంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, కృష్ణా, బేగంపేట, సికింద్రాబాబు, ఖాజీపేట, జున్నుకుంట, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, బాలచంద్రాపూర్, నాగ్‌పూర్, ఆమ్లా, భేతూర్, హిటాచీ, జంబ్లపూర్, పాట్నా, మానిక్‌పూర్, ప్రయగరాజ్ చౌకీ, మీర్జాపూర్ స్టేషన్ మీదుగా వెళ్తుందని వివరించారు. అలాగే హుబ్లీ, ఖటీహర్ మీదుగా ప్రత్యేక రైలు.నెం.07325 ఈ నెల 9వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రతి బుధవారం ఉంటుదన్నారు. తిరుగు ప్రయాణం రైలు.నెం.07326ను ఈ నెల 12 నుంచి మే 3వ తేదీ వరకు ప్రతి శనివారం నడుపనున్నట్లు తెలిపారు. ఈ రైలు గదక్, కొప్పల్, హోస్పేట్, తోర్నగల్లు, బళ్లారి, గుంతకల్లు, డోన్, నంద్యాల, దిగువమెట్ట, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బ్రాహ్మణపూర్, బోలాపూర్, శాంతినికేతన్ స్టేషన్ మీదుగా నడుస్తుందని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

ఎల్లెల్సీలో తగ్గిన నీటిమట్టం


బాపురం వద్ద ఎల్ఎల్సీ

హాలహర్వి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తుంగభద్ర దిగువ కాలువలో నీటి మట్టం తగ్గిపోయింది. తాగునీటి అవసరాల కోసమే నిరు వదులుతున్నామని, అందేకు తగ్గించినట్లు తుంగభద్ర బోర్డు డీఈ హుసేన్ బాషా తెలిపారు. ఈనెల 15వరకు నీరు వదులుతామని, సాగునీటిని పూర్తిస్థాయిలో నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

తుగ్గలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పొలానికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో కూలి సురేంద్ర (32)మృతి చెందాడు. వివరాల మేరకు.. మృతుడు సుకేంద్ర కాంట్రాక్టర్ వద్ద కూలీగా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం మండలంలోని దిగువచింతలకొండకు చెందిన రైతు పులిశేఖర్ పొలానికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు కాంట్రాక్టర్ కూలీలను తీసుకెళ్లి పనులు చేయించారు. పనులు చేస్తుండగా పందికోనకు చెందిన సురేంద్రకు తీగెలు తాకడంతో విద్యుదాఘాతానికి గరయ్యాడు. హుటాహుటిన పత్తికొండ వైద్యశాలకు తరలించగా.. అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతునికి భార్య సువర్ణతో పాటు కొడుకు, కుమార్తె ఉన్నారు. కాంట్రాక్టర్ ఎల్‌సీ తీసుకోకుండానే పనులు చేయడంతోనే ప్రమాదం సంభవించిందని విద్యుత్ అధికారులు తెలిపారు. పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్, ఎస్ఐ క్రిష్ణమూర్తి, విద్యుత్ ఏఈ మహేశ్వరరెడ్డి పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యులు, విద్యుత్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ సభ్యులకు పరీక్ష


రోగిని స్ట్రెచర్‌పై తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్టెచర్ బాయ్‌ల కొరత వేధిస్తోంది. సిబ్బంది లేకపోవడం, రోజురోజుకు సిబ్బంది సంఖ్య తగ్గుతోంది. దీంతో స్ట్రెచర్‌పై రోగిని బంధువులే తీసుకుని వచ్చి పరీక్షలకు వెళ్తుంటారు. కర్నూలు చెందిన సుబ్బమ్మ అనే రోగిని బంధువులు ఎఫ్ఎం-6 నుంచి కార్డియాలజీ వార్డుకు టూడీ ఎకో పరీక్షకు తీసుకువచ్చారు. ముగ్గురు బంధువులు స్ట్రెచర్‌పై ఎండలో తీసుకుని రావడం కష్టంగా ఉందంటున్నారు. అధికారులు స్ట్రెచర్ బాయ్‌లను నియమించాలని రోగులు కోరుతున్నారు.

27 నుంచి కూచిపూడి, భరతనాట్యంపై వర్క్‌షాప్

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఈనెల 27 నుంచి కూచిపూడి, భరతనాట్యంపై మూడు రోజుల వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, నటరాజ కళామందిర్ వ్యవస్థాపకుడు కరీముల్లా సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు. హైదరాబాద్ సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్ కూచిపూడి ఎ గురువు శ్రీపద్మ కల్యాణి, విజయవాడకు చెందిన భరతనాట్యం గురువు సంతోష్ పాల్గొంటారని తెలిపారు. రూ.500 చెల్లించి 15లోగా పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 7780475080, 9963628418 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నూతన విధానంలో వృత్తి పన్ను వసూలు

● వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సుధాకర్

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వృత్తి పన్ను వసూళ్లను పారదర్శకంగా చేసేందుకు ఏప్రిల్ 1 నుంచి నూతన విధానాన్ని తీసుకువస్తున్నట్లు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సుధాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్, రిటర్న్ దాఖలు పన్నుల చెల్లింపుకు పొందుపరిచినట్లు ఆయన పేర్కొన్నారు. వృత్తి పన్ను చెల్లింపుదారులు నిబంధనల మేరకు పన్ను చెల్లించాలని, వార్షిక టర్నోవర్ రూ.10 లక్షల కంటే అదనంగా ఉన్న జీఎస్‌టీ చెల్లింపుదారులు వృత్తి పన్నులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడులు

రూ.50 వేలు విలువ చేసే మందులు సీజ్


మందుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నూనెపల్లెకు చెందిన శ్రీవైష్ణవి మెడికల్ షాప్‌పై బుధవారం నంద్యాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దాడులు చేశారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే మత్తుమందులు, యాంటీ బయాటిక్స్ విక్రయిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, రూ.50 వేల విలువచేసే ఎన్ఆర్ఎక్స్ మందులను సీజ్ చేశారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దాదాఖలందర్ మాట్లాడుతూ సమాచారం మేరకు దాడులు చేశామని, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తుమందులు, యాంటీ బయాటిక్స్ అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడిలో వీఆర్వో సల్మాన్, జీజీహెచ్ ఫార్మసిస్టు లక్ష్మీనారాయణ, ఈగల్‌టీం సిబ్బంది పాల్గొన్నారు.

తియ్యటి మందు..




● హోమియోకు పెరుగుతున్న ఆదరణ
● దీర్ఘకాలిక రోగాలకు ప్రత్యామ్నాయ వైద్యం
● నేడు ప్రపంచ హోమియో దినోత్సవం

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హోమియో గుళికలు తియ్యగా నోట్లో వేసుకుంటేనే కరిగిపోతాయి. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు హోమియో వైద్యం వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. అలోపతి వైద్య విధానంలో సైడ్ ఎఫెక్ట్స్‌కు తాళలేక ప్రజల్లో హోమియో వాడకం ఎక్కువైంది. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులకు హోమియో తప్ప ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. ఖరీదు తక్కువగా ఉండటంతో ప్రజలు హోమియో వైద్యం వైపు మొగ్గు చూపుతున్నారు. జర్మనీ దేశానికి చెందిన శ్యామూల్ హానిమూన్ హోమియో వైద్య పితామహుడు. ఆయన తన నిరంతర పరిశోధన అనుభవంతో అనేక సత్ఫలితాలు సాధించారు. 208 సంవత్సరాల క్రితం హానిమూన్ కనుగొన్న మందులు ఇవాళ ప్రపంచ వ్యాప్తంగా విస్తరించాయి. నేడు వరల్డ్ హోమియో డే సందర్భంగా ఆంధ్రజ్యోతి కథనం...

దీర్ఘకాలిక వ్యాధులకు హోమియో ప్రత్యామ్నాయంగా ముందుకు వచ్చింది. అలోపతి వైద్యం భారీ ఖర్చుతో కూడినదిగా మారడం వల్ల పేద, మధ్య తరగతి రోగులు హోమియో వైపు మొగ్గు చూపుతున్నారు. కర్నూలు నగరంలో 20 ఏళ్ల క్రితం కేవలం నలుగురు హోమియో వైద్యులు ఉండేవారు. ప్రస్తుతం కర్నూలు, నంద్యాల జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు హోమియో వైద్యులు 150 మంది సేవలు అందిస్తున్నారు. దాదాపు ఐదు రెట్లు హోమియో వైద్యులు పెరిగారు. కర్నూలు, నంద్యాలలో కూడా కార్పొరేట్ సంస్థలు కూడా హోమియో క్లినిక్‌లను ప్రారంభించారు.

● ఉమ్మడి జిల్లాలో 21 డిస్పెన్సరీలు

ఉమ్మడి జిల్లాలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో 21 డిస్పెన్సరీలు పని చేస్తున్నాయి. ప్రభుత్వ హోమియో వైద్యులు 12 మంది ఉండగా.. ఎన్‌హెచ్ఎం కింద 9 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. ఇక కర్నూలు ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీలో రోజు ఓపీకి 60 నుంచి 70 మంది చికిత్స కోసం వస్తుంటారు. గత పది సంవత్సరాలతో పోలిస్తే హోమియోకు 40 శతం రోగులు పెరిగాయి.

● దీర్ఘకాలిక ప్రయోజనాలు:

చర్మ వ్యాధులు, కీళ్ల నొప్పులు, అలర్జీ, మానసిక ఆందోళన, సైనసైటిస్, కిడ్నీలో రాళ్లు, సయాటికా, ఫైల్స్, తలనొప్పి (మైగ్రీన్) అర్థరైటిస్, నరాల బలహీనత, టాన్సిల్స్, జీర్ణకోశ వ్యాధులు, సోరియాసిస్, ఊబకాయం వంటి దీర్ఘకాలిక వ్యాధులకు హోమియో మందులతో మెరుగైన ఫలితాలు వస్తాయి. డెంగీ, మెదడువాపు, స్వైన్‌ఫ్లూ వంటి ప్రమాదకర వ్యాధులకు బాగా పని చేస్తాయి.

● వైద్య రంగంలో హోమియో విప్లవం



వైద్యరంగంలో హోమియో వైద్యం విప్లవం సృష్టిస్తుంది. జర్మనీకి చెందిన డా. హానిమన్ కన్న కల సంపూర్ణగా నెరవేరుతోంది. దీర్ఘకాలిక జబ్బులకు హోమియో మందులతో మెరుగైన చికిత్స అందించవచ్చు. జబ్బును ప్రాథమిక దశలో గుర్తించి హోమియో మందులు వాడితే త్వరగా నయమవుతుంది. ముఖ్యంగా జలుబు, స్కిన్ అలర్జీ, శ్వాసకోశ వ్యాధులకు హోమియోలో మంచి ఫలితం ఉంటుంది. ఉచిత హోమియో వైద్యాన్ని ప్రజలకు అందించడానికి ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా హోమియో డిస్పెన్సరీలను ఏర్పాటు చేసింది.

- డా.డి. మహాదేవరావు, సీనియర్ మెడికల్ ఆఫీసర్, కర్నూలు ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీ

● 39 ఏళ్లుగా ఉచిత సేవలు



కర్నూలులోని ధర్మపేటలో 1986 జూన్ 1 నుంచి దయల్బాగ్ రాధాస్వామి చారిటబుల్ హోమియో డిస్పెన్సరీ ద్వారా ప్రతి రోజు వంద మందికి సాయంత్రం 6 నుంచి 8 గంటలకు చికిత్స అందిస్తున్నాను. సీజనల్ వ్యాధులు, వడదెబ్బ, డెంగ్యూ జ్వరాలు, పిల్లల్లో జ్ఞాపకశక్తి పెంచడం, చికెన్‌ఫాక్స్ వంటి వ్యాధులకు ఉచిత హోమియో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేస్తున్నాం. ప్రతి బుధవారం కర్నూలు ధర్మపేటలో పేదల ఇల్లిల్లా తిరిగి ఉచితంగా హోమియో మందులు ఇస్తున్నా.

- డా. కె. భాస్కర్ రెడ్డి, హోమియో వైద్యుడు, దయాల్బాగ్ రాధాస్వామి చారిటబుల్ హోమియో డిస్పెన్సరీ

● హోమియోతో మంచి ఫలితాలు



సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా, దీర్ఘకాలిక మొండి వ్యాధులను హోమియో వైద్యంతో నయం చేయవచ్చు. ఇటీవల కాలంలో హోమియో వైద్యానికి ఆదరణ బాగా పెరిగింది. అల్లోపతి వైద్యంతో విసిగిన రోగులు ప్రత్యామ్నాయంగా హోమియో వైద్యం వైపు మొగ్గు చూపుతున్నారు. సోరియాసిస్, ఆస్తమా, అలర్జీ, థైరాయిడ్, షుగర్, బీపీ, సీవోపీడీ, కిడ్నీ రాళ్లు, హార్మోన్ల సమస్య, స్పాండిలైటిస్‌కు మెరుగైన చికిత్స పొందవచ్చు.

- డా. శిరీషారెడ్డి, లైఫ్ హోమియోపతి, కర్నూలు

నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవు

● మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి


మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్

మంత్రాలయం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన మంత్రాలయం, మాధవరం ఏపీ మోడల్ స్కూల్, చిలకలడోన కేజీబీవీ, మాధవరం, రచ్చుమర్రి, మంత్రాలయం అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే బోజనంలో ప్రమాణాలు పాటించకపోవడం, రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడంపై మండిపడ్డారు. మోడల్ స్కూల్‌లో ఆరుబయట వంట చేస్తున్నట్లు గుర్తించారు. అలాగే కాలంచెల్లిన రాగిపిండి, బెల్లంను స్వాధీనం చేసుకున్నారు. పరిమాణం తక్కువగా ఉన్న గుడ్లను తూకం వేసి వీటిని ఏజెన్సీకి వెంటనే అప్పగించి, మార్చాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. కోట్లలో ఖర్చు చేస్తున్నా పాఠశాలలో సక్రమంగా అమలు కావడం లేదన్నారు. మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో వడ్డించిన సాంబారులో కంది పప్పు తక్కువగా ఉండటంతో వంట ఏజెన్సీకి నోటీసులు జారీ చేయాలని ఎంఈవో మైనుద్దీన్, రాగన్న, హెచ్ఎం అంపయ్యను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు సంతృప్తికరంగా పని చేస్తున్నాయని అన్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న వాటిలో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. అద్దెలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తున్నామన్నారు. అనంతరం బీసీ హాస్టల్‌ను తనిఖీ చేసి పిల్లలకు నాణ్యమైన ఆహారం ఇవ్వాలని ఆదేశించారు. తనిఖీలో డీఎస్‌వో రఘువీర్, ఐసీడీఎస్ పీడీ నిర్మల, సీడీపీవో నరసమ్మ, తహసీల్దార్ ఎస్.రవి, సివిల్ సప్లయ్ డీటీ లు మహేష్, వలిబాషా, వీఆర్వోలు భీమన్నగౌడు, హెచ్ఎంలు అంపయ్య, భోజరాజు, ప్రిన్సిపాల్స్ శాంతి, ప్రసాద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగలక్ష్మి, టీచర్లు లావణ్యలత, తులసమ్మ పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఆధార్ సేవలు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నట్లు జడ్పీ సీఈవో నాసరరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 0 నుంచి 6 సంవత్సరాల్లోపు చిన్నారుల తల్లిదండ్రులు సేవలను ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామంలో ఇటీవల ఇందూరి ప్రతాప్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. బుధవారం ఆళ్లగడ్డ డీఎస్పీ కార్యాలయంలో ఇద్దరు నిందితుల అరెస్టును చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిరివెళ్ల మండలం గోవింపల్లె గ్రామానికి చెందిన రవీంద్రారెడ్డి, సంజామల మండలం పెరుసోముల గ్రామానికి చెందిన సందెపోగుల పక్కీరయ్యతోపాటు మరో ముగ్గురు ఇందూరి ప్రతాప్‌రెడ్డిపై కత్తితో దాడి చేశారన్నారు. ఈ కేసులో రవీంద్రారెడ్డి, పక్కీరయ్యలను గోవిందపల్లె గ్రామ శివారులో నంద్యాల-కడప హైవే రోడ్డులోని కానాలపల్లి మెట్ట వద్ద అరెస్టు చేశామన్నారు. 2017 సంవత్సరంలో అదె గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి అన్న ఇందూరు ప్రభాకర్‌రెడ్డి హత్య కేసులో రవీంద్రారెడ్డి కూడా నిందితుడిఇ అన్నారు. పాత కక్షల కారణంగా దాడి చేశారని భావిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కేసులో సహకరించిన మరో ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. కేసులో చురుకుగా వ్యవహరించిన ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, శిరివెళ్ల సీఐ వంశీధర్, ఎస్సై చిన్నపీరయ్యలను ఆయన ప్రశంసా పత్రాలతో అభినందించారు.

బంగారు ఆభరణాల చోరీ

ఆదోని, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండులో ఈనెల 6న ఓ మహిళ బ్యాగులో నుంచి బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పట్టణంలోని కిల్చిన్ పేటకు చెందిన సునీత బళ్లారి వెళ్లేందుకు తిమ్మారెడ్డి బస్టాండుకు ఈనెల ఆరో తేదీన చేరుకుంది. ఆమె బ్యాగ్‌లో ఉన్న 15 తులాల బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. బాధిత మహిళ ఊరికి వెళ్లి వచ్చాక బుధవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

రైల్వే ప్లాట్ ఫారంపై మృతదేహం

డోన్ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపై ఓ వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్ఐ బిందుమాధవి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని జంగాల కాలనీలో వ్యాపారం చేసుకుంటూ నివాసముంటున్న తూర్పాటి వెంకటేశ్వర్లు (49) రైల్వే ప్లాట్‌ఫాంపై మృతి చెందాడని తెలిపారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ప్లీనరీకి హాజరైన కాంగ్రెస్ నాయకులు


ప్లీనరీలో కాంగ్రెస్ నాయకులు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్లీనరీకి ఆ పార్టీ నాయకులు హాజరయ్యారు. ఏఐసీసీ సభ్యుడు జె.లక్ష్మీ నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగ మధు యాదవ్, సయ్యద్ నవీద్ ముర్షిద్ ఖాద్రీ, సయ్యద్ నవీద్ హజరయ్యారు.

కోడుమూరు ఘటనపై విచారణ

• కలెక్టర్‌కు నివేదిక ఇస్తా : ఆర్డీవో


హైమావతిని విచారిస్తున్న ఆర్డీవో సందీప్‌కుమార్

కోడుమూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పొలం సమస్యను పరిష్కరించాలని కోరిన హైమావతి పట్ల వీర్వోలు అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు రూ.లక్ష వసూలు చేసినట్లు వార్తలు అధికారులు స్పందించారు. బుధవారం కర్నూలు ఆర్డీవో కె.సందీప్‌కుమార్ బుధవారం కోడుమూరు తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేశారు. బాధిత మహిళను కార్యాలయానికి పిలిపించి, పొలం సమస్యపై విచారణ చేశారు. హైమావతికి అనుకూలంగా వచ్చిన కోర్టు తీర్పును క్షణ్ణంగా పరిశీలించారు. బాధితురాలు మాట్లాడుతూ తహసీల్దార్, వీఆర్వోలు తన నుంచి సుమారు రూ.లక్ష వసూలు చేశారన్నారు. పొలాన్ని ఆన్‌లైన్ చేయాలంటే మా కోరిక తీర్చాలని వీఆర్వోలు నారాయణ, పరమేష్, వెంకటరాముడు తనను మానసికంగా, శారీరకంగా వేధించినట్లు బాధితురాలు తన ఆవేదనను వెళ్లగక్కింది. మంగళవారం జరిగిన ఘటన అనంతరం నీ పొలం నీకు కాకుండా చేస్తామని ముగ్గురు వీఆర్వోలు తనను బెదిరించారని ఆవేదన వ్యక్తం చేసింది. వీఆర్వోల నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆర్డీవోకు మొరపెట్టుకొంది. ఆర్డీవో మాట్లాడుతూ ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశావా అని ప్రశ్నించారు. తాను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని హైమావతి సమాధానం చెప్పింది.

కలెక్టర్‌కు నివేదిస్తాను

బాధితురాలు చెప్పిన విషయాలన్ని కలెక్టర్‌కు నివేదిస్తా. కోర్టు తీర్పు హైమావతికి అనుకూలంగా ఉండటంతో మరోసారి రికార్డులను పరిశీలించి బాధితురాలికి న్యాయం చేస్తాం.

- సందీప్‌కుమార్, ఆర్డీవో, కర్నూలు

నడిచేదారేదీ?

నంద్యాల టౌన్ ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో ఫుట్‌పాత్‌లను అక్రమార్కులు వదల్లేదు. ఎక్కడ పడితే అక్కడ అక్రమించుకుంటున్నారు. దీంతో నడిచేందుకు వీలు లేకుండా రహదారులు తయారయ్యాయి. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలో 42 వార్డుల ఉండగా, దాదాపుగా 3లక్షల జనాభా ఉంది. ఇటీవల జిల్లా కేంద్రం ఏర్పాటు కావడంతో ప్రజల రాకపోకలు అధికమయ్యాయి. కొంత మంది వ్యాపారులు యథేచ్ఛగా రోడ్లపైనే వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.

- ఫుట్‌పాత్‌ల ఆక్రమణ.. అద్దెకు ఇస్తున్న వైనం
- పట్టించుకోని పురపాలక అధికారులు
- ఇబ్బంది పడుతున్న పట్టణ ప్రజలు



ఆసుపత్రి దగ్గర ఇలా..



పద్మావతి నగర్ ఫుట్‌పాత్‌పై అద్దె తీసుకున్న ఉన్న దుకాణాలు ఇవే

పట్టణంలో ఇలా....

- నంద్యాల పద్మావతి నగర్‌లోని ఒక ప్రముఖ వైద్యుడు హస్పిటల్ నిర్మించి దాని అనుకుని ఉన్న పుట్ పాత్ స్థలాన్ని మూడు దుకాణాలకు అద్దెకు ఇచ్చారు. ఒక్కో దుకాణానికి నెలకు రూ.6వేలు. అడ్వాన్సుగా రూ.10 ముందుగానే చెల్లించారు. ఇలా ఫుట్ పాత్ స్థలాన్ని సైతం అద్దెకు ఇస్తున్నారు.
- టూ టౌన్ పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న పుట్ పాత్‌లపై మొబైల్ క్యాంటిన్ పెట్టుకోవడానికి పక్కనే ఉన్న స్థల యజమానికి నెలకు రూ.5వేలు చెల్లిస్తున్నారు.
- జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అనుకుని ఉన్న ఫుట్ పాత్ పై కొన్ని ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నారు. కానీ అక్కడే ఉన్న ముగ్గురు వ్యక్తులు ఫుట్‌పాత్‌లను బాగ పరిష్కారం చేసుకుని వారు వ్యాపారం చేసుకుంటూ..మిగిలిన ఫుట్‌పాత్‌లను ఆద్దెకు నెలకు రూ.3500 చొప్పున ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- టెక్కెలో ఉన్న పండ్ల దుకాణదారులు సైతం ఫుట్‌పాత్‌లను అక్రమించుకుని స్థల యజమానులకు నెల రూ.5 వేలు చెల్లిస్తున్నారు.

ఇప్పటికైనా పురపాలక అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకుని తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



టూటౌన్ పోలీసు స్టేషన్‌కు ఎదురుగా మొబైల్ క్యాంటీన్

స్వచ్ఛందంగా వారే తొలగించాలి...

ఫుట్‌పాత్‌లపై ఉన్న అక్రమణలను వారే తొలగించాలి. అలా లేని పక్షంలో మేమే అక్రమణలను తొలగిస్తాం. వీటి వల్ల పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- నిరంజన్‌రెడ్డి, కమిషనర్ నంద్యాల



టెక్కె మార్కెట్‌యార్డు రోడ్డుపై ఇలా

ఆచరణాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం

పాణ్యం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆచరణాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం ఉంటుందని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్ పేర్కొన్నారు. కళాశాలలో ఐఐసీ, ఆర్ అండ్ డి, ఎకాక్ సంయుక్తంగా విజనరీ వెంచరస్ బిజినెస్ ప్లాన్ చాలెంజ్ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థులు కొత్త వ్యాపార ఆలోచనలతో పాల్గొని తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ రామిరెడ్డి, ఆర్అండ్‌డి డైరెక్టర్ కృష్టారెడ్డి, ఇకాక్ కోఆర్డినే టర్ డాక్టర్ పివి గోపికృష్ణా రావు, కన్వీనర్ టి. శాంతల పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రానివ్వొద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ యశస్విని

మహానంది, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య రానివ్వకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు మండలాధ్యక్షురాలు యశస్విని సూచించారు. బుధవారం మహానంది మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో మహమ్మద్ దౌలా ఆధ్వర్యంలో తిమ్మాపురం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోతాగునీటి సమస్యతో పాటు ప్రజా సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని అన్నారు. ప్రజలు వడ దెబ్బకు గురికాకుండా ఉండేందుకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఈవోఆర్డీ నాగేంద్రుడు, మండల ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ షఫివుల్లా, వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి,ఉపాధిహామీ పథకం ఏపీఎం మల్లిఖార్జున, విద్యాశాఖాధికారి రామసుబ్బయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తోట కవిత పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరను ఉపసంహరించాలి



కొత్త బస్టాండ్ వద్ద రోడ్డుపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ సిలిండర్ల ధరను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద గ్యాస్ సిలిండర్‌లతో వినూత్నంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సామాన్యులు వాడుతున్న వంటగ్యాస్ సిలిండర్ ధరను ఒక్కసారిగా రూ.50 పెంచడం ప్రజలపై భారం మోపడమే అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించే విధంగా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్ భాష, బాబు, భాస్కర్, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండలాగుతున్న ఎద్దులు

కొత్తపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎదురుపాడు గ్రామంలో నిర్వహించిన బండలాగుడు పోటీలు బుధవారం హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన ఆరుపళ్ల విభాగం 11 జతల వృషభాలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో మిద్తూరుకు చెందిన సాయివర్ధన్ వృషభాలు 5,100 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి రూ.40వేలు నగదును కైవసం చేసుకున్నాయి. అలాగే తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లాలోని ఈడిగోనిపల్లెకు చెందిన వంశీ కృష్ణ, గూడెందొడ్డికి చెందిన సహదేవుడుల వృషభాలు 4,749 అడుగులు లాగి రెండో బహుమతి రూ.30వేలు గెలుచుకున్నాయి. అలాగే వైఎస్సార్ జిల్లా దాసరపల్లి గ్రామానికి చెందిన అశోక్ వృషభాలు 4,397 అడుగుల దూరం లాగి మూడో బహుమతి రూ.20వేలు కైవసం చేసుకున్నాయి. జూపాడుబంగ్లా చెందిన మహబూబ్ బాషా వృషభాలు 3,997 అడుగుల లాగి 5వ బహుమతి రూ.10వేలు సొంతం చేసుకున్నాయి.

రేపు వాహనాల వేలం

ఆత్మకూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరిండెంట్ రవికుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్ నందు వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం పాటలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ నెల 11వ తేది ఉదయం 11గంటలకు జరిగే వేలం పాటలో పాల్గొనేందుకు ఆసక్తి గల వారు నిర్దేశించిన డిపాజిట్‌తో వేలాల్లో పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9440902585, 9177299067 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎంసెట్‌కు ఉచిత శిక్షణ

సున్నిపెంట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025 సంవత్సరం ఎంసెట్ పరీక్షలకు హాజరైయ్యే విద్యార్థులకు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తునట్లు ప్రిన్సిపాల్ ఆర్.మారెన్న తెలిపారు. 2025 ఎంసెట్ పరీక్షలకు సంబంధించి గతంలో ఇంటర్‌మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు, ప్రస్తుతం కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

మట్టి పరీక్షలతో పంటలకు రక్ష



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

వెలుగోడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంటపొలాల్లో మట్టి నమూన పరీక్షలు చేయించుకొని పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో పవన్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన వెలుగోడు పట్టణంలో మట్టి నమూనా సేకరణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది అంజిత్‌కుమార్‌రెడ్డి, రామక్రిష్ణ, నాగమణి, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా: ఎమ్మెల్యే



పాములపాడులో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

పాములపాడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు తాను ఎల్లప్పుడు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. పాములపాడులో బుధవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీకోసం పనిచేసిన వారిని పార్టీ గుర్తించి పదువులు కట్టబెడుతుందని, వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. మండలంలో గోకులం షెడ్లు, వేసవిలో తాగునీటి బోర్లు కావాలనుకునే వారు తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు యాదవ్, సీనియర్ నాయకులు ఆళ్ళగడ్డ హరిసర్వోత్తమరావు. టీడీపీ మండల కన్వీనర్ రవీంద్రరెడ్డి, హరినాథ్‌రెడ్డి, పూసలక్రిష్ణ, సన్ని. జనార్దన్, ఏసేపు, అలీసాహెబ్, రఘురామిరెడ్డి, నబిరసూల్, లక్ష్మీకాంతరెడ్డి, మల్లికార్జున,జలాల్ బాషా, ఉస్మాన్ బాషా రాజు, మద్దిలేటి, మల్లేశ్వరరెడ్డి, స్వాములు, లింగస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

అధికారులు జవాబుదారి తనంతో పనిచేయాలి

మండలంలోని అధికారులు జవాబుదారి తనంతో పని చేయాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. బుధవారం పాములపాడులోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక తహసీల్దార్ షుభద్రమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల నుంచి టీడీపీ నాయకులు ఆయా గ్రామాలలోని ప్రజల సమస్యలను అధికారులు దృష్టికి తెస్తే వారు స్పందించడం లేదని మండిపడ్డారు. విద్యుత్ ఏఈ, పీఆర్ ఏఈ మండలంలో సరిగా విధులు నిర్వహించడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వివిధ సమస్యలపై 52 వినతులను ప్రజలు ఎమ్మెల్యేకు అందించారు. మిట్టకందాల గ్రామానికి రాయితీలో మంజూరైన పవర్‌స్ప్రేను, రోటా వీటర్‌ను ఆత్మకూరు ఎడిఎ ఆంజనేయ, స్థానిక ఏవో పణీశ్వరరెడ్డి ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతులకు అందించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, అర్జీదారులు పాల్గొన్నారు.

విచారించాకే పాత సామాను కొనండి: సీఐ



మాట్లాడుతున్న ఆత్మకూరు అర్బన్ సీఐ రాము

ఆత్మకూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పాతసామాను దుకాణాల నిర్వాహకులు తమ వద్ద పాతసామాగ్రి విక్రయించే వ్యక్తుల వివరాలను విచారించిన తర్వాతే వారి సామాగ్రిని కొనుగోలు చేయాలని ఆత్మకూరు అర్బన్ సీఐ డీ.రాము పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో పాతసామాను దుకాణదారులతో ఆయన మాట్లాడారు. ఏదైన పాతసామాను కొనుగోలు చేసే ముందు విక్రయదారుల గురించి పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాత కోనుగోలు చేయాలని అన్నారు. దొంగ వస్తువులు కొనుగోలు చేసినట్లయితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ముందస్తు చర్యల్లో భాగంగా వారిపై బైండోవర్ కేసులను నమోదు చేశారు. అదేవిధంగా ఆత్మకూరు పట్టణంలో పాతసామాను ఏరుకునే కార్మికులను సైతం స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. పొలాల్లో మోటార్లను దొంగతనం చేసి విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇకపై అలాంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ముందుస్తు చర్యల్లో భాగంగా వారిపై కూడా బైండోవర్ కేసులను నమోదు చేశారు.

అలగనూరు రిజర్వాయర్‌కు మరమ్మతులు చేపట్టాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గడివేముల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులు తక్షణమే చేపట్టాలని రాయలసీమ సాగునీటి సాదన సమితీ అధ్యక్షుడు బొజ్జదశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం రైతులతో కలిసి ఆయన తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులకు నోచుకోక ఏడేళ్లవుతుందని, రైతులు సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేసీ కెనాల్ ఆయకట్టు పరిరక్షణలో భాగంగా వెలగమాను ఫీడర్‌కెనాల్‌ను నిర్మాణం చేపట్టాలని పదేళ్లగా ప్రతిపాదనలు చేస్తున్నా పాలకులు స్పందించడం లేదని అన్నారు. ప్రభుత్వం స్పందించి అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులకు, వెలగమాను ఫీడర్‌చానల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు రాంమోహన్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి

ఆత్మకూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో బాలవివాహాల నిర్మూలనపై డివిజనల్ స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఆడపిల్లలకు 18ఏళ్ళు, అబ్బాయిలకు 21ఏళ్ల తర్వాత వివాహం చేయాలని అన్నారు. 18ఏళ్లలోపు ఆడబిడ్డలకు వివాహం చేయడం వల్ల గర్భసమయంలో అనేక సమస్యలు ఉత్పన్నవుతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆడబిడ్డలకు 8-10 తరగతుల మధ్యలోనే చదువు ఆపేసి వివాహాలు చేస్తున్నారని అలాంటి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామస్థాయిలో మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, అంగన్‌వాడీ వర్కర్లు, స్కూల్ టీచర్లు బాల్యవివాహల నిషేద చట్టం గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లయితే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, 100, 181 నంబర్లకు సమాచారం ఇవ్వాలని అన్నారు. సమాచారం ఇచ్చే వ్యక్తుల పేర్లను గోప్యంగా ఉంచుతామని అన్నారు. కాగా బాల్యవివాహాలకు ప్రోత్సహించినట్లయితే రూ.లక్ష జరిమానాతో పాటు రెండేళ్ల జైలు శిక్షణ ఉంటుందన్నారు. పోక్సో చట్టం కూడా వర్తిస్తుందని హెచ్చరించారు. ప్రతినెలలో 1, 3 శుక్రవారాల్లో గ్రామీణ స్థాయిలో సమీక్షా సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీవో కోటేశ్వరీ, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వైద్యాధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

12న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఇందిరేశ్వరం గ్రామంలో 12న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సీఎస్ఐ గ్రామ యూత్ కమిటీ సభ్యులు సాగర్, ప్రవీణ్,సుమంత్, అయ్యప్ప తెలిపారు.ఈ పోటీల్లో పాల్గొనే వారు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతిగా రూ. 20,016లు,రెండో బహుమతిగా రూ.10,016,మూడో బహుమతిగా రూ. 5,016 అందజేయనున్నట్లు తెలిపారు.

హామీలన్నీ నెరవేరుస్తాం : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా

బండిఆత్మకూరు, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం తీరుస్తుందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం బండిఆత్మకూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల నుంచి ఇంతవరకు రెవెన్యూ సమస్యలే అధికంగా వస్తున్నాయని, ఇది గత జగన్ ప్రభుత్వ రిసర్వే ఫలితమేనన్నారు. ప్రతి ఏటా రెండు పంటలకు సాగు నీరు అందించి తీరుతామని అన్నారు. కార్యక్రమంలో కెసీ చైర్మన్ రామలింగారెడ్డి, తెలుగుగంగ వైస్ చైర్మన్ కంచర్ల మనోహర్‌చౌదరి, మండల టీడీపీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, శ్రీశైలం ట్రస్ట బోర్డు మాజీ సభ్యుడు చిట్టిబొట్ల భరద్వాజశర్మ, యూనిట్ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు, క్లస్టర్ ఇన్‌చార్జిలు చిన్న లింగారెడ్డి, మళ్ళేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రహిమాన్, తహసీల్దార్ పద్మావతమ్మ, ఎంపీడీవో దస్తగిరి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: మంత్రి



ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న మంత్రి

నంద్యాల మున్సిపాలిటీ ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఫరూక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నంద్యాల పరిశీలకులు పోతురాజు రవికుమార్ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి బుధవారం ఒక మండల కేంద్రంలో జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముఖ్య నాయకులతో సమావేశం

పార్టీ కార్యాలయంలో వార్డు ఇన్‌చార్జిలు, టీడీపీ నాయకులతో మంత్రి , ఫరూక్, టీడీపీ నంద్యాల పరిశీలకులు పోతురాజు రవికుమార్ సమవేశమయ్యారు. సీఎం చంద్రబాబు నాయుడు చేపట్టిన కెఎస్ఎస్(కుటుంబ సాధికార సారథులు)లో పార్టీలోని ప్రతి ఒక్కరూ సభ్యులుగా ఉండాలని సూచించారు. కెఎస్ఎస్‌లుగా వారికి కేటాయించిన 60 మంది బాగుగోలును కెఎస్ఎస్ సభ్యులు చూసుకోవాలన్నారు.

- నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన బింగుమళ్ల శ్యాం సుందర్ గుప్తను మంత్రి ఫరూక్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, యువనాయకుడు ఎన్ఎండి ఫయాజ్ అభినందించారు.

కాల్షియం కార్బైడ్‌ను వినియోగించకూడదు



మాట్లాడుతున్న ఆహార నియంత్రణ అధికారి వెంకటరాముడు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మామిడి, అరటి, నిమ్మ,జామ తదితర పండ్లను మాగబెట్టే విధానంలో నిషేధిత కాల్షియం కార్బైడ్‌ను వినియోగించకూడదని జిల్లా ఆహార నియంత్రణ అధికారులు వెంకటరాముడు, కాశీంవలి అన్నారు. బుధవారం నంద్యాల పండ్ల మార్కెట్‌లో పండ్ల వ్యాపారస్తులకు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆహార నియంత్రణ అధికారి మాట్లాడుతూ రాష్ట్ర ఫుడ్‌సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు వ్యాపారస్తులకు, రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో ఉద్యానశాఖ జిల్లా అధికారి నాగరాజు మాట్లాడుతూ పండ్లను మాగబెట్టే విధానంలో నిషేధిక కాల్షియం కార్బైడ్‌ను వినియోగించి ప్రజలను అనారోగ్యానికి గురి చేయరాదన్నారు. పండ్లను ఏసీ గోడౌన్‌లో మాత్రమే మాగబెట్టాలన్నారు. ప్రభుత్వం సూచించిన ఎఫ్ఎస్ఎస్ఐ గుర్తు కలిగిన మందులను మాత్రమే వాడి పండ్లను మాగబెట్టాలన్నారు. పండ్లు పరిపక్వ దశలో ఉన్నప్పుడు మాత్రమే కోత కోయాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం కూడా పండ్ల వ్యాపారులకు, రైతులకు ప్రోత్సాహకాలు కల్పిస్తుందని, వాటిని ఉపయోగించుకోవాలన్నారు. ఈ సదస్సులో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, మార్కెటింగ్ ఏడీ రహిమాన్, శానిటేషన్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, పండ్ల వ్యా పారస్తులు పాల్గొన్నారు.

రోజూ పారిశుధ్య పనులు చేయించండి



జలకనూరు గ్రామంలో చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోఆర్డీ

మిడుతూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ గ్రామంలో పారిశుధ్య పనులు తప్పకుండా చేయాలని ఈవోఆర్డీ సంజన్న అన్నారు. బుధవారం జలకనూరు గ్రామంలో పారిశుద్య పనులను ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి షఫి అహమ్మద్‌తో ఈవోఆర్‌డీ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి రోజు పారిశుధ్య కార్మికులతో చెత్త సేకరణను తప్పకుండా చేయించాలని అన్నారు. గ్రామంలో సర్పంచుతో కలిసి ఇంటింటికి వెళ్లి పరిసర ప్రాంతంలో చెత్త, మురుగు లేకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం చెత్త సేకరణ కేంద్రాన్ని ఈవోఆర్డీ పరిశీలించారు.

ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో స్టైలా 5.0 సదస్సు



విద్యార్థులతో ప్రొఫెసర్ రామనారాయణరెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐ బోధనా, సహకార అభివృద్ధి వ్యూహాలపై స్టైలా 5.0 సదస్సు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఢిల్లీకి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ డాక్టర్ రామనారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారు కృత్రిమ మేధస్సు ఆధారిత బోధనా విధానాలు, ఆధునిక విద్యా ప్లాట్‌ఫాంల వాడకంతో బోధనను ఎలా సమర్థవంతంగా మార్చుకోవచ్చో, విద్యార్థుల మధ్య సహకార అభ్యాసాన్ని ప్రోత్సహించే వ్యూహాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డి పాల్గొన్నారు.

పోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు

డోన్ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పోరాటాల యోధుడు చంద్ర రాజేశ్వరరావు అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కే. రామాంజనేయులు అన్నారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐలో భూపోరాట యోధుడు ఆదర్శ కమ్యూనిస్టు ఉద్యమ నేత అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, పులిశేఖర్, కే.రామాంజనేయులు, ఎన్కే రామ్మోహన్ పృథ్వీ కుమార్, హరిక్రిష్ణ, రజాక్, దివాకర్, మనోహర్, కొండయ్య పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

సంజామల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య అన్నారు. బుధవారం నొస్సం గ్రామంలో పతాంజలి ఫుడ్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ పంట సాగుకు సంబంధించిన వివరాలను రైతులకు తెలియజేశారు. సమావేశంలో కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్, ఉద్యానవనశాఖ అధికారి రఘువరన్, పతాంజలి ఫుడ్ జిల్లా మేనేజర్ మహదేవయ్య, రైతులు పాల్గొన్నారు.

గుడిని కాపాడుకుందాం

సంజామల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మన ఊరినే కాదు గుడిని కాపాడుకుందామని టీడీపీ నాయకులు బెలుం సురేష్ రెడ్డి అన్నారు. బుధవారం పేరుసోమల గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయం ఉన్న రెండు కోనేరుల ప్రక్షాళనపై సమావేశం నిర్వహించారు. ఈ నెల 13న గ్రామంలోని చిన్న కోనేరులో పూడికతీత పనులు చేపడుదామని తీర్మానించారు. గ్రామస్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల ప్రముఖ న్యాయవాది ఆరికట్ల మల్లికార్జున రెడ్డి, కోవెలకుంట్ల ఈవోపీఆర్డీ ఆర్.కె నాయుడు, శివశంకర్ రెడ్డి, చిన్నశేఖర్, రహమతుల్లా, నారాయణస్వామి, నరసింహ మూర్తి, నాగరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

డోన్ రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన చెక్కులను బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అందజేశారు. బుధవారం మధ్యాహ్నం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో 42 మంది బాధితులకు మంజూరైన రూ.43,41,356ల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ఎంతగానో శ్రద్ధ తీసుకుందని ఎమ్మెల్యే తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన చెక్కులను బాధితులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అప్పుడు మరిచి ఇప్పుడు నీతులా?



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : అధికారంలో ఉండగా కార్యకర్తలను గాలికి వదిలేసి పరిశ్రమలను దోచుకున్న వైసీపీ నాయకులు ఇప్పుడు నీతులు చెప్పడం సిగ్గుచేటని టీడీపీ మండల అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో హత్యా రాజకీయాలను ప్రోత్సహించి, టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వేదించారంటూ మండిపడ్డారు. నాయకులు ఇళ్లపై దాడులు చేసి కేసు పెట్టి జైలుకు పంపిన ఘనత మీది కాదా అంటూ ప్రశ్నించారు. పరిశ్రమలను తీసుకవచ్చింది, రైతులకు అండగా నిలిచింది టీడీపీ, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డేనని పునరుద్ఘాటించారు. కార్యకర్తల మెప్పు కోసం అబద్ధాలు ప్రచారం చేయడం తగదని, మరోసారి మంత్రిపై విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ నాయకులు అంబటి జయలక్ష్మీరెడ్డి, గూలి నాగేశ్వరరెడ్డి, కామిని క్రిష్ణరంగారెడ్డి, ఇటిక్యాల శివారెడ్డి, సత్యారెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

వీఆర్వోల సమస్యల పరిష్కారానికి కృషి

డోన్ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): డోన్ మండలంలోని వీఆర్వోల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆ సంఘం మండల అధ్యక్షులు మల్లారెడ్డి, రామకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. తమపై ఎంతో నమ్మకం ఉంచి వీఆర్వో సంఘం మండల అధ్యక్షులుగా ఎన్నుకున్నారని, సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు.

గ్రామ సచివాలయాల తనిఖీ

బేతంచెర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని వివిధ సచివాలయాలను డీఎల్డీవో నరసింహారెడ్డి, ఎంపీడీవో ఫజుల్ రెహిమాన్, బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమీక్షా సమా వేశం నిర్వహించారు. సర్వేలపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బండలాగుడు పోటీలు


ప్యాపిలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రపల్లి గ్రామంలో కోదండరాములస్వామి తిరునాళ్ల ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు బుధవారం ముగిశాయి. పోటీల్లో ఎనిమిది జతల వృషభాలు పాల్గొనగా, అందులో అనంతపురం జిల్లా మేడిమేకలపల్లి గ్రామానికి చెందిన తిరుపాల్‌రెడ్డి వృషభాలు మొదటి స్థానం, మండలంలోని పీఆర్‌పల్లి గ్రామానికి చెందిన వాసుదేవరెడ్డి వృషభాలు రెండవ స్థానం, నంద్యాల జిల్లా రామతీర్థం గ్రామానికి చెందిన నాగరాజు వృషభాలు మూడవ స్థానం, మండలంలోని హుసేనాపురానికి చెందిన వెంకటసుబ్బారెడ్డి వృషభాలు నాల్గవ స్థానం, పీఆర్‌పల్లి గ్రామానికి చెందిన రామాంజినేయులు వృషభాలు ఐదవ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన వృషభాలకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు నిర్వాహకులు వై లక్ష్మీనారాయణయాదవ్ అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బేతంచెర్ల: చౌడేశ్వరి దేవి తిరునాళ్ల జ్యోతి మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలు జిల్లా లింగాల మండలం రామాపురం గ్రామానికి చెందిన అక్షరరెడ్డి ఎద్దులు ప్రథమ విజేతగా నిలిచాయి. బేతంచెర్ల పట్టణానికి చెందిన వైబీ శేఖర్ రెడ్డి ఎద్దులు రెండో బహుమతి, బేతంచెర్లకు చెందిన మేకల భానుజా ఎద్దులు మూడో విజేతగా నిలిచాయి. ఉయ్యాలవాడ మండలం నర్సిపల్లి గ్రామానికి చెందిన ఉప్పరి లక్ష్మిదేవి ఎద్దులకు నాలుగో బహుమతి, బనగానపల్లె మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన నాగేంద్ర ఎద్దులకు 5వ బహుమతి వచ్చింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మల్లు సుబ్బారెడ్డి, మల్లిపెద్ది రఘురాంరెడ్డి, రామాంజనేయులు, మద్దయ్య, శేఖర్ రెడ్డి, మద్దిలేటి, రామస్వామి, గౌరి హుశేన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో బుధవారం బండలాగుడు పోటీలను గ్రామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీలను కేసీకెనాల్ డీసీ చైర్మన్ బబ్బూరి వెంకటస్వామి, బబ్బూరి కృష్ణ ప్రారంభించారు. ఈ పోటీలలో 13 జతల ఎద్దులు పాల్గొన్నాయి. మొదటి విజేతగా కోసూరు గ్రామానికి చెందిన వీరబ్రహ్మంనాయుడు ఎద్దులు నిలిచాయి. రెండో బహుమతి తెంపల్లి కృష్ణ జిల్లా శ్రీనివాసరావు ఎద్దులు, మూడో బహుమతి ఉప్పుమాగలూరు బాపట్ల జిల్లా రవిశంకర్‌రెడ్డి ఎద్దులు, వరుసగా ఎనిమిది బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కోనాటి శ్రీనివాసరావు, ముప్పావల వెంకటేశ్వరరావు, గడ్డం నరసింహారావు, చల్లా శ్రీనివాసరెడ్డి, బత్తిని వెంకటేశ్వర్లు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాళ్లూరి నాయుడు, జాఫర్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నదాత భగీరథ యత్నం

- ఉద్యాన పంటలను రక్షించుకోవడానికి రైతుల కష్టాలు
- అడుగంటిన భూగర్భ జలాలు
- ఎండిపోతున్న పంటలు
- వేయి అడుగులు తవ్వినా కనిపించని నీటి జాడ



ట్యాంకర్‌తో మొక్కలకు నీరు పడుతున్న రైతు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల మండలంలో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయి. బోరు బావులు, వ్యవసాయ బావుల్లో నీటి ఊటలు తగ్గిపోవడంతో అన్నదాతలు సాగు చేసిన ఉద్యానవన పంటలను కాపాడుకోవడానికి భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. లక్షలాది రూపాయాలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు కళ్ల ముందే ఎండిపోతుంటే కాపాడుకోడానికి అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. కొలిమిగుండ్ల మండలంలోని మదనంతపురం, కోరుమానుపల్లె, చింతలాయపల్లె, అబ్దులాపు రం తదితర గ్రామా ల్లో సుమారు 500ఎకరాల్లో అరటి, మునగ, చీనీ, బొప్పాయి తదితర పంటలు రైతులు సాగు చేశారు. అయితే గత ఈ రెండు నెలల ఏడాది కాలంగా నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆయా గ్రామాల్లో భూగర్భ జలాలు నానాటికీ అడుగంటి పోతున్నాయి. దీంతో పంలను రక్షించుకోవ డానికి రూ. లక్షలు వెచ్చించి నూతన బోరు బావులు తవ్విస్తున్నారు. 500నుంచి 1000అడుగుల లోతు బోర్లు వేసినా అన్నదాత కంట కన్నీరు తప్ప, బోరు బావుల్లో నీటి జాడ కానరావడంలేదు. వ్యవధిలోనే ఆయా గ్రామాల్లో సుమారు 30 నూతన బోర్లు తవ్వించారంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో చేసేది లేక కొందరు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి పంటలు కాపాడే భగీరథ యత్నం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో సుమారు 100ఎకరాల వరకు ఉద్యాన పంటలు ఎండి పోయిన పరిస్థితి నెలకొంది.



నీరు లేక ఎండిపోయిన అరటి తోట

ఐదు బోర్లు వేయించా



నాలుగు ఎకరాల్లో అరటి ఎండిపోతుండటంతో రూ. ఆరు లక్షలకు పైగా ఖర్చు చేసి, ఐదు బోర్లు వేయించాను. అయినా ఫ లితం లేకుండా పోయింది. చుక్క నీరు పడని పరిస్థితి నెలకొంది.

- కంబగిరి రాముడు, రైతు, మదనంతపురం

తోట ఎండిపోయింది



ఏడు ఎకరాల్లో చీని తోట సాగు చేశాను. భూగర్భ జలాలు అడుగంటి, బోర్లు ఎండి పోవడంతో చెట్లు ఎండిపోతున్నాయి. మూడు బోర్లు వేశాను. అయినా నీరు పడలేదు. దీంతో కొంత పొలం ఎండి పోయింది. వేరే రైతు నుంచి నీరు పెట్టుకొని కొన్ని చెట్లు కాపాడే ప్రయత్నం చేస్తున్నా.

- గురు భాస్కరరెడ్డి, రైతు, చింతలాయపల్లె

సోలార్‌పై అవగాహన కల్పించండి

కోవెలకుంట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ రూఫ్ టాప్‌పై అవగాహన కల్పించి వాటిని వినియోగించుకునేలా చూడాలని డోన్ ఆర్డీవో కే.నరసింహులు అన్నారు. బుధవారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఎంపీడీవో వరప్రసాదరావు ఆధ్వర్యంలో సోలార్ రూఫ్‌టాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డోన్ ఆర్డీవో నరసింహులు, విద్యుత్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటే విద్యుత్ బిల్లు తక్కువ వస్తుందని, అదే విధంగా ప్రభుత్వం నుంచి సబ్సిడీ లభిస్తుందని ప్రజలు వినియోగించుకునేలా చైతన్యం కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరు సోలార్ నిర్మించుకుంటే కరెంటు ఆదా అవుతుందన్నారు. సమావేశంలో విద్యుత్ ఏడీ సునీల్‌కుమార్‌రెడ్డి, ఈవోపీఆర్డీ ప్రకాశ్‌నాయుడు, వెలుగు ఏపీఎం శేఖర్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు మహిళలు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీలకు ఉచితం

బనగానపల్లె: ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం ఎస్సీ ఎస్టీలకు ఉచితమని డోన్ ఆర్డీవో నరసింహులు అన్నారు. బుధవారం బనగానపల్లె పట్టణంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణంలో సూర్యఘర్ పథకంపై గ్రామ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్డీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఎస్సీలకు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. బీసీలకు 30శాతం సబ్సిడీతో ఈ పథకాన్ని ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈసందర్భంగా తహసీల్దారు నారాయణరెడ్డి, ఎంపీడీవో రమణ, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, గర్భప్పలు సూర్యఘర్ పథకం వల్ల ప్రయోజనాలను వివరించారు. సమావేశంలో సర్పంచ్ ఎల్లమ్మ, ఉపసర్పంచ్ బురానుద్దీన్, విద్యుత్ శాఖ ఏడీ మద్దిలేటి, ఈవో సతీశ్‌రెడ్డి, గ్రామ సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డోన్ ఆర్డీవో నర్సింహులు

వైభవంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

రుద్రవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరంలోని ప్రతాపరుద్ర ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం అశేష భక్తజనం మధ్య ధ్వజస్తంభం ప్రతిష్ఠ, ఆంజనేయస్వామి ఆలయంపై శిఖర కలశాల ప్రతిష్ఠ నిర్వహించారు. రుద్రవరం వాస్తవ్యులు చెన్నయ్య, మల్లేశ్వరి దంపతులు రాసిన రామకోటి గ్రంథాలను ఆంజనేయస్వామి దేవాలయంలో నిర్వాహకులకు అప్పగించారు. అంతరకు ముందు రామకోటి గ్రంథాలను ఊరేగింపుగా తీసుకవచ్చి దేవాలయంలో అప్పగిస్తామన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్మించనున్న కల్యాణ మండప నిర్మాణానికి రూ. రూ.6,01,116లు విరాళం అందించారు. బుధవారం సాయంత్రం కల్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే ప్రతిష్ఠ పూజలకు మూడురోజుల పాటు అన్నదానానికి రూ.2,01,116లు వారు అందించారు. ధ్వజస్తంభాన్ని మచ్చ పెద్దనరసింహుడు, నారాయణమ్మ దంపతులు, లక్ష్మీనరసింహా, లత దంపతులు విరాళమందించారు.



శిఖరంపై కలశం



ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

మెరుగైన విద్యను అందించాలి

ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బాలికలకు మెరుగైన విద్యను అందించాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి సూచించారు. బుధవారం రాత్రి పట్టణంలోని పలు పాఠశాలలను , హాస్టళ్లను ఆయన తనిఖీ చేశారు. పట్టణంలోని కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. స్టోర్‌రూంలో సరుకులను పరిశీలించారు. బాలికల నుంచి వివరాలు తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ప్రిన్సిపాల్ సునీతకు సూచించారు. అనంతరం పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. హాస్టల్‌లో హాస్టల్ విద్యార్థులకు అందిస్తున్న ఫుడ్‌ను స్వయంగా పరిశీలించారు. అనంతరం హాస్టల్ స్టోర్‌రూంలో ఉన్న సరుకులను పరిశీలించారు. కూరగాయలను పరిశీలించారు. అలాగే హాస్టల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, మరమ్మతు పనులను పరిశీలించారు. హాస్టల్ వార్డెన్ ముంతాజ్‌తో మాట్లాడి విద్యార్థినులకు నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. అనంతరం బనగానపల్లె పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి అనంతరం వార్డెన్ విద్యావతితో మాట్లాడి నాణ్యమైన భోజనం అందించి మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని కోరారు. హాస్టల్‌లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హాస్టల్ వెల్ఫేర్ అధికారులు రాముడు, హాస్టల్ వార్డెన్లు నాగేంద్ర, మునిరాజ్, మహ్మద్‌రఫి, ఎస్సీ డిప్యూటీ డైరెక్టర్ చింతామని, బీసీ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్. ఓబులేసు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న విజయప్రతాప్‌రెడ్డి

అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

డోన్ రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): డోన్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి చేశారు. బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్టుహౌస్ సమావేశ భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి నేరుగా ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. నీటి సరఫరా, రహదారులు, పింఛన్లు, విద్యుత్, ఆరోగ్య సమస్యలు తదితర వాటిపై ఫిర్యాదులు వచ్చాయి. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశం లో డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్ కుమార్ రెడ్డి, ఏఈ నారాయణ, పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలం భాస్కర్ నాయుడు, టీడీపీ నాయకులు ఓం ప్రకాష్ పాల్గొన్నారు.



సమస్యను వింటున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

దుష్ప్రచారానికి భయపడం

డోన్ రూరల్: బీసీలకు అన్యాయం చేస్తున్నారని, కొందరు నాయకులు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. డోన్‌లో టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ బీసీ మహిళకు కేటాయించిన డోన్ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ పదవి విషయంలో బీసీలను పక్కన పెడుతూ ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఇస్తున్నారని పార్టీ అధిష్టానానికి తప్పుడు ఫిర్యాదులు కొందరు ఇస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి చిల్లర చేష్టలు తగదన్నారు. డోన్ నియోజకవర్గంలో పార్టీకి పని చేసిన వారిలో అన్ని కులాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెంచిన వంట గ్యాస్ ధరను తగ్గించాలి



డోన్‌లో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

డోన్ రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, సభ్యులు అక్బర్ బాషా, నక్కి హరి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను నిరసిస్తూ బుధవారం బేతంచెర్ల రోడ్డులో సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నక్కి శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్రం కార్పొరేట్ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తూ పేద, సామాన్య ప్రజలపై భారాలు మోపుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో అనుబంధ సంఘాల నాయకులు అశోక్, శ్రీనివాసులు, హుశేన్ బాషా, రమేష్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

బేతంచెర్ల: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ల ధరలను వెంటనే తగ్గించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ మండల అధ్యక్షుడు వెంకటరమణ సీఐటీయూ ఆధ్వర్యంలో పాతబస్టాండులో ఖాళీ సిలిండర్లతో కట్టెలపొయి వెలిగించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, నాయకులు ఖాజా, మధుశేఖర్, సంజీవుడు, నరసింహ, రాజాబాబు, హుశేన్‌బాషా, రాముడు, తిరుమలేష్, ప్రసాద్, హరినాథ్, అంకాలు, శ్రీను, జలంధర్ పాల్గొన్నారు.

వసుధ ఫౌండేషన్ సేవలు మరువలేనివి



చెక్కులు పంపిణీ చేస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె నియోజకవర్గంలో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగులకు అందిస్తున్న సేవలు మరువలేనివని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. బుధవారం బనగానపల్లె పట్టణంలోని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఆవరణలో వసుధ ఫౌండేషన్ కోఆర్డినేటర్ టంగుటూరు శ్రీనయ్య సహకారంతో 11మంది రోగులకు రూ.లక్ష పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు, జనసేన నాయకుడు భాస్కర్, టీచర్ నాగరాజు, మౌళీశ్వరరెడ్డి, మీరాపురం భాస్కర్‌రెడ్డి, భరతుడు, లాయర్ నాగేంద్రారెడ్డి, బాలరాజు, హరి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని పూర్తి చేయాలి

కోవెలకుంట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో గృహ నిర్మాణాలు వేగవంతం చేసి లక్ష్యాన్ని పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి సాంబశివారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో ప్రత్యేక అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 1 నుంచి మే 31లోపు 306 ఇళ్లు పూర్తి చేయాలని ప్రభుత్వం టార్గెట్ ఇచ్చిందన్నారు. అయితే ఇప్పటి వరకు కేవలం 52 ఇళ్లు మాత్రమే పూర్తి అయ్యాయని, మిగిలిన వాటిని మే 31లోగా పూర్తి చేయాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి టార్గెట్లు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఏఈ రమణారెడ్డి, ఎంపీడీవో వర ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

కోవెలకుంట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పంటలు సాగు చేసి అధిక లాభాలు పొందాలని వ్యవసాయాధికారి నిరంజన్ అన్నారు. బుధవారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో వ్యవసాయశాఖ అనుబంధ శాఖ సిబ్బంది, వెలుగు సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శేఖర్, ఎన్ఎఫ్ఈ రామక్రిష్ణ, మాస్టర్ ట్రైనరు సుబ్బరాయుడు, వెలుగు సీసీలు ,వీవోఏలు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగు లాభదాయకం

చాగలమర్రి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల సాగు లాభదాయకమని కోవెలకుంట్ల క్లస్టర్ పరిధి ఏపీడీ సాంబశివరావు సూచించారు. బుధవారం చాగలమర్రి ఉపాధి కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోవెలకుంట్ల క్లస్టర్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో 2025-26కు 1,150 ఎకరాలు పండ్ల తోటల సాగు చేయాలన్న లక్ష్యం ఉందన్నారు. 16 రకాల పండ్ల తోటలను వందశాతం సబ్సిడీతో ఉపాధి హామీ ద్వారా నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. చాగలమర్రి మండలంలో 110 ఎకరాలు గుర్తించాలన్నారు. 15 వేల మంది ఉపాధి కూలీలకు పనులు కల్పించాల్సి ఉండగా ప్రస్తుతం 10,500 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారని తెలిపారు. పశువులకు దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లో నీటి తొట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 18 నీటి తోట్లు మంజూరయ్యాయని, ఒక్కోక్క నీటి తొట్టికి రూ.33 వేలు నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఖాసీం, ఈసీ నరసింహులు పాల్గొన్నారు.

పోషణ్ పక్షోత్సవాలపై అవగాహన

చాగలమర్రి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో పోషణ్ పక్షోత్సవాలను జయప్రదం చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. బుధవారం అంగన్‌వాడీ వర్కర్లకు పోషణ్ పక్షోత్సవాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ 1000 రోజుల ఆరోగ్య సంక్షేమం గురించి జాగ్రత్తలను వివరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత పాటించేలా చూడాలని అన్నారు. పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపం నివారించాలి

రుద్రవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లో పౌష్టికాహారం లోపాన్ని నివారించడానికే వెయ్యి రోజుల జీవనశైలి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజరు లక్ష్మీదేవి అన్నారు. బుధవారం మండలంలోని ముత్తలూరు గ్రామంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజరు మాట్లాడుతూ వెయ్యి రోజుల సంరక్షణపై శ్రద్ధ వహించాలన్నారు. బిడ్డ పుట్టిన తరువాత ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

శిరివెళ్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప బుధవారం తెలిపారు. మండల కేంద్రమైన శిరివెళ్లని బోర్లకు భూగర్భ జలాలు పుష్కలంగా అందేందుకు గ్రామంలోని ఆనకట్ట కుంటను కేసీ కెనాల్ నీటితో పూర్తిగా నింపినట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో మరమ్మతులకు గురైన చేతి పంపులు, బోర్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. వేసవి ముగిసేంత వరకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేటి నుంచి వార్షికోత్సవాలు

ఉయ్యాలవాడ ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలవాడ గ్రామ సమీపంలో కుందూనది ఒడ్డున వెలసిన వేణుగోపాలస్వామి ఆశ్రమ ఏక త్రింశతి వార్షికోత్సవాలు గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు బుధవారం తెలిపారు. ప్రతిరోజూ ఉదయం ధార్మికోపన్యాసం, మధ్యాహ్నం గీతాజ్ఞాన యజ్ఞం ఉంటుందన్నారు. ముఖ్య ఉపన్యాసకులుగా కృష్ణానంద, శ్రయానంద సరస్వతి, దేవానందగిరి, శిల్పా మాతాజీ స్వాములు హాజరవుతున్నారు. శనివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు.